News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :124 | ఖమ్మం | గురువారం, జూన్ 19, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## ఇజ్రాయెల్ అంతు చూస్తాం.. అడ్డువస్తే అమెరికాను వదలం..
## ఖమేనీ మాస్ వార్నింగ్



ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, అమెరికా జోక్యం తో మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ మేఘాలు కమ్ముకుం టున్నా యి. ఇరాన్ పై అమెరికా సైనిక చర్య తీసుకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ. ఇజ్రాయెల్, అమెరికాపై తీవ్ర విమర్శలు

వివరాలు 2లో..

## ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా బనకచర్లపై నిర్ణయం

ఈ మేరకు జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ భరోసా ఇచ్చారు :కిషన్‌రెడ్డి వెల్లడి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా నిర్ణయం తీసుకుంటామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ భరోసా ఇచ్చారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, భాజపా

వివరాలు 2లో..



## తెలంగాణ హక్కుల పరిరక్షణకు
# కలిసి నడుద్దాం

- ప్రభుత్వ విజ్ఞప్తికి వివిధ పార్టీల ఎంపీల మద్దతు
- బనకచర్ల ప్రాజెక్టుతో రాష్ట్రానికి తీవ్ర నష్టం
- కేంద్రం అనుమతులు ఇవ్వకుండా ఒత్తిడి తెద్దామన్న సర్కారు
- కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్న భాజపా ఎంపీలు
- రాష్ట్ర హక్కులు కాపాడడానికి కట్టుబడి ఉన్నామన్న భారాస
- సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ ఆ పార్టీ ఎంపీ వద్దిరాజు వాకౌట్

ఆంధ్రప్రదేశ్ చేపట్టిన పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ హక్కుల పరిరక్షణకు కలిసిరావాలన్న ప్రభుత్వ విజ్ఞప్తికి అఖిలపక్ష పార్టీల ఎంపీలు మద్దతు ప్రకటించా రు. ఈ ప్రాజెక్టుపై కార్యాచరణకుగాను బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రానికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా... భాజపా ఎంపీలు డీకే అరుణ, రఘునందన్‌రావు, భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతోపాటు కాంగ్రెస్ ఎంపీలు, నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బనకచర్ల ప్రాజెక్టుపై ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, గోదావరి బేసిన్ ప్రాజెక్టులపై డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్య ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టులు, వాటి కింద నీటి వినియోగం, సబ్ బేసిన్‌లోని ప్రవాహాల వివరాలను వెల్లడించారు. సమావేశం అనంతరం అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో తీర్మానం చేద్దామని సీఎం ప్రతిపాదించారు. సమావేశంలో సీఎం చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రయోజనాలు కాపాడుకునేలా ఉన్నాయని నిరసిస్తూ భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వాకౌట్ చేశారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మద్దతు ఇవ్వనున్నట్లు ఎంఐఎం ఎంపీ పేర్కొన్నారు.

వివరాలు 2లో..

## రూ.3 వేలకు వార్షిక టోల్‌పాస్

- వాణిజ్యేతర వాహనదారులకు కేంద్రం శుభవార్త
- హైవేలపై 200 ట్రిప్పులు తిరగొచ్చు
- ఒక్కో టోల్‌గేట్ ఒక్కో ట్రిప్పు
- ఆగస్టు 15 నుంచి అమల్లోకి..





జాతీయ రహదారులు(ఎన్‌హెచ్), జాతీయ ఎక్స్‌ప్రెస్‌వే(ఎన్‌ఈ)లపై ప్రయాణించే వాణిజ్యేతర ప్రైవేటు వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. వీరి కోసం ఆగస్టు 15 నుంచి రూ.3వేల వార్షిక ఫాస్టాగ్ టోల్‌పాస్ విధానాన్ని ప్రవేశపెడుతోంది. దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. రూ.3వేలతో ఫాస్టాగ్ టోల్‌పాస్ తీసుకునే కార్లు, జీపులు, వ్యాన్ల యజమానులు ఏడాదిపాటుగానీ, 200 ట్రిప్పుల వరకుగానీ జాతీయ రహదారులపై ప్రయాణించవచ్చు. కొత్త విధానం వ్యక్తిగత కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే వర్తిస్తుంది. వాణిజ్య వాహనాలకు చెల్లుబాటు కాదు. 200 ట్రిప్పులు పూర్తయ్యాక మళ్లీ రూ.3వేలతో యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా ఏడాదిలో ఎన్ని సార్లైనా చేసుకోవచ్చు. ఇప్పటికే ఫాస్టాగ్ ఉన్నవారు మళ్లీ కొత్త ఫాస్టాగ్‌ను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. పాత ఫాస్టాగ్‌లోనే టోల్‌పాస్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు.

వివరాలు 2లో..

## హైదరాబాద్‌లో గూగుల్ సంస్థకు మా 'వాళ్లే' పోటీ!

- హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- డిజిటల్ భద్రతే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని వెల్లడి
- నైపుణ్యాభివృద్ధికి రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్న సీఎం
- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి




హైటెక్ సిటీలో గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ సెంటర్ 2 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దానికి సమీపంలోనే ఇందిరా మహిళా శక్తి సెంటర్ మూడున్నర ఎకరాల్లో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ మహిళలు గూగుల్‌కు గట్టి పోటీ

వివరాలు 2లో..

## బనకచర్ల అన్యాయంపై ఉత్తమ్ వద్ద సమాధానం లేదు

- బనకచర్ల వల్ల తెలంగాణకు జరిగే నష్టంపై మంత్రి మౌనంగా ఉన్నారన్న ఎంపీ అర్వింద్
- పవర్‌పాయింట్ ప్రజంటేషన్ అంతా డైవర్షన్ రాజకీయమేనని విమర్శ
- దివ్యాంగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించిందని ఆరోపణ
- కేసీఆర్ ఆదేశాలతోనే ఉత్తమ్ సెంటిమెంట్ రెచ్చగొడుతున్నారని ఫైర్
- సిట్ నుంచి తనకు ఎలాంటి పిలుపు రాలేదని స్పష్టం చేసిన అర్వింద్
- మహేశ్ కుమార్ గౌడ్ ఫోన్ ఎందుకు ట్యాప్ చేశారో చెప్పాలంటూ ప్రశ్న



బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో చెప్పమంటే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వద్ద సమాధానం లేదని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టారని అర్వింద్ ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "బీజేపీ భరోసా కార్యక్రమం ద్వారా ఎన్నో వినతిపత్రాలు స్వీకరించాం. ముఖ్యంగా చాలా మంది దివ్యాంగులు వచ్చి వారి సమస్యలను మాతో పంచుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారికిచ్చిన హామీలను కూడా నెరవేర్చడంలో విఫలమైంది. దీనివల్ల ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింది" అని అన్నారు. మంత్రి ఉత్తమ్

## కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరించండి

- కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌కు మంత్రి లోకేశ్ వినతి
- ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, హోంమంత్రి అమిత్‌షాలతో భేటీ



ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ బుధవారం ఇక్కడ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, ఆహారశుద్ధి, పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాసవాన్‌లను కలిశారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు వివిధ రంగాల్లో తీసుకొచ్చిన సంస్కరణల గురించి వారికి వివరించారు. న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్‌ను కలిసి కర్నూలులో

వివరాలు 2లో..

# ఫోన్ ట్యాపింగ్ పచ్చి నిజం

- బైబిల్‌పై ప్రమాణం చేసి చెప్పగలను
- ఇదే విషయం వైవీ సుబ్బారెడ్డి నాకు చెప్పారు
- గన్, కేసీఆర్ సంబంధం ముందు రక్తబంధం చిన్నబోయింది

'నాది, నా భర్తది, నా దగ్గరి వాళ్ల ఫోన్లు ట్యాప్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ అయిందనేది ముమ్మాటికీ పచ్చి నిజం. బైబిల్ మీద ప్రమాణం చేసి చెప్పగలను. ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణకు ఎక్కడికైనా వస్తాను' అని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా బుధవారం విశాఖ విమానాశ్రయానికి వచ్చిన షర్మిల.. మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాప్ అయినట్లు వైవీ సుబ్బారెడ్డి తనకు చెప్పి నిర్ధారించారన్నారు. ట్యాప్ చేసిన ఒక ఆడియోను తన ఇంటికి వచ్చి మరీ ఆయన వినిపించారని తెలిపారు. ఇప్పుడు ఇదే విషయం ఆయన

వివరాలు 2లో..




## జగన్ పల్నాడు పర్యటనలో ఆంక్షలు ఉల్లంఘన .. ఎస్పీ కీలక వ్యాఖ్యలు



- జగన్ పల్నాడు పర్యటనలో నిబంధనలు ఉల్లంఘనలు
- నిబంధనల ఉల్లంఘనలపై కీలక వ్యాఖ్యలు చేసిన పల్నాడు ఎస్పీ
- లీగల్ ఒపీనియన్ తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడి

వివరాలు 2లో..

## రేవంత్ రెడ్డి ఆ పని చేస్తేనే నామినేషన్లు వేయనిస్తాం

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న కవిత
- బీసీ రిజర్వేషన్లకు రేవంత్ అనుమతి తీసుకురావాలని డిమాండ్
- మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని సూచన



వివరాలు 2లో..

# తెలంగాణ హక్కుల పరిరక్షణకు కలిసి నడుద్దాం

- మొదటి పేజీ తరువాయి

పోలవరం నుంచి బనకచర్లకు గోదావరి నీటిని మళ్లించేందుకు ఏపీ సిద్ధమవుతున్నట్లు తెలిసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బనకచర్లను అడ్డుకునేందుకు అన్ని పార్టీలు కలిసి పోరాటం చేద్దామని ప్రతిపాదించారు. రాష్ట్రం వాదనలను వినిపించేందుకు న్యాయనిపుణుల పేర్లను సూచించాలని అఖిలపక్ష పార్టీల ఎంపీలను కోరారు.

### రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

బనకచర్ల ప్రాజెక్టుపై రాజకీయ ప్రయోజనాల కన్నా రైతాంగ ప్రయోజనాలే ముఖ్యమని మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా పేర్కొన్నారు. ‘ప్రాజెక్టుపై ఉన్న అభ్యంతరాలను కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, భూపేంద్ర యాదవ్‌ల దృష్టికి తీసుకెళ్తున్నాం. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రానికి చెందిన ఎంపీలంతా ప్రతిఘటించాలని కోరాం. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతం తప్పదు. రూ. 81,900 కోట్లతో పోలవరం జలాశయం నుంచి కృష్ణా నది మీదుగా వరద నీటిని పెన్నాకు తరలించడానికి మూడు భాగాలుగా నిర్మిస్తున్నారు. 417 కిలోమీటర్ల దూరంలో కాలువలు, పైపులు, సొరంగాలతో పాటు తొమ్మిది విద్యుత్ ఆధారిత ఎత్తిపోతల పథకాలకు రూపకల్పన చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్‌ను మార్చడమే కాకుండా గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ ఆదేశాలను కూడా విస్మరిస్తున్నారు.

గోదావరి జలాశయాల్లో 968 టీఎంసీల నీటి వాటాను కాదని అదనపు వరద నీటిని తరలించుకునే ఎత్తుగడలో భాగంగానే ఈ ప్రాజెక్టుకు ఏపీ రూపకల్పన చేసింది. భద్రాచలం రామాలయంతో పాటు మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం నుంచి తెలంగాణ-ఏపీ సరిహద్దుల్లో ఉన్న గ్రామాలు ముంపునకు గురవుతాయి. గోదావరి నీటి సమస్యల ట్రైబ్యునల్ తుది ఉత్తర్వుల ప్రకారం తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సూచనల మేరకే షెడ్యూల్‌లో మార్పులు చేయాలన్న నిబంధనలు ఉన్నాయి’ అని ఉత్తమ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నుంచి ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్, బలరాం నాయక్, వంశీకృష్ణ, సురేష్ షెట్కార్, రఘువీర్, రేణుకాచౌదరి, రఘురాంరెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### కిషన్‌రెడ్డి, సంజయ్ వచ్చి ఉంటే బాగుండేది

అఖిలపక్ష సమావేశానికి భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌లను గౌరవ అతిథులుగా ఆహ్వానించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. వారు హాజరై ఉంటే బాగుండేదంటూ భాజపా ఎంపీలతో పేర్కొనగా.. తమను కిషన్‌రెడ్డి పంపారని ఎంపీలు డీకే అరుణ, రఘునందన్‌రావు తెలిపారు. తెలంగాణ హక్కులు, బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా కలిసివస్తామని వారు చెప్పారు. ప్రభుత్వం చెబుతున్న నీటి వినియోగం వివరాలను తమకు అందించాలని డీకే అరుణ కోరారు.

### బనకచర్లను వ్యతిరేకిస్తున్నాం

తెలంగాణ హక్కుల పరిరక్షణకు భారాస మొదటి నుంచీ కట్టుబడి ఉందని భారాస రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టు అక్రమమని, తమ పార్టీ వ్యతిరేకిస్తోందని చెప్పారు. ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రానికి వరప్రదాయిని అయిన కాళేశ్వరం రెండు పియర్లు కుంగితేనే గాలికి వదిలేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు జారీ చేయడం లేదని పేర్కొన్నారు.

### నేడు దిల్లీకి రేవంత్, ఉత్తమ్

కేంద్ర మంత్రులను కలిసేందుకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర జలశక్తిశాఖ, అటవీ, పర్యావరణ శాఖల మంత్రులతో వారు భేటీ కానున్నారు.

# ఏలూరు జిల్లాలో ఆయిల్ ఫామ్‌కు ప్రోత్సాహం

ఏలూరు జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఈ ఏడాది జిల్లాలో 15 వేల హెక్టార్లలో ఆయిల్ ఫామ్ పంటను విస్తరించడమే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బుధవారం ఆయన పెదవేగిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ పరిశోధన కేంద్రాన్ని (ఐఐఓపీఆర్) సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు, ఆయిల్ ఫామ్ కంపెనీల ప్రాసెసర్లతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఆయిల్ ఫామ్ పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై ప్రధానంగా చర్చించారు. అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలు, కోకో వంటి అంతర పంటల సాగుపై అవగాహన, డెల్టా భూముల్లో ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించడం, వరి, పొగాకు వంటి సంప్రదాయ పంటల నుంచి ఆయిల్ ఫామ్ వైపు పంటల వైవిధ్యీకరణ, ఆయిల్ ఫామ్ సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించడం వంటి కీలక అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పెదవేగిలోని ఆయిల్ పామ్ పరిశోధన కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నతమైన స్థానంలో ఉందని ప్రశంసించారు. ఈ కేంద్రం ద్వారా అనేక మంది రైతులకు, ఆయిల్ ఫామ్ ప్రాసెసర్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందన్నారు. సుమారు 29 మంది శాస్త్రవేత్తలు ఇక్కడ పనిచేస్తున్నారని, 250 ఎకరాల విస్తీర్ణంలో చక్కటి మౌలిక సదుపాయాలతో ఆయిల్ ఫామ్ పంట పరిశోధన, టిష్యూకల్చర్ వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. రైతులకు అధిక దిగుబడులు అందించే ప్రక్రియలను, వివిధ పరిశోధనల గురించి సంస్థ డైరెక్టర్ డాక్టర్ కంచర్ల సురేష్ లోతుగా వివరించారని మంత్రి తెలిపారు.ప్రధానంగా ఐదు కంపెనీల ప్రతినిధులు, శాస్త్రవేత్తలతో ఆయిల్ ఫామ్ పంట సాగుపై సుదీర్ఘంగా చర్చించామని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా దృష్టి సారించామని అన్నారు. అభివృద్ధిలో జిల్లాను ప్రస్తుతమున్న 5వ స్థానం నుంచి 3వ స్థానానికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. జీడీపీ వృద్ధికి ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంటను మరింత విస్తరించాలని, రైతులను ప్రోత్సహించే విషయంపై ముఖ్యమంత్రి సమక్షంలో పలుమార్లు చర్చించినట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యాన్ని 5 వేల హెక్టార్ల నుంచి 15 వేల హెక్టార్లకు పెంచినట్లు ప్రకటించారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ ఆయిల్ ఫామ్ పంట సాగులో ఉన్న సమస్యలను వివరించారని, డెల్టా ప్రాంతంలో కూడా ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి తెలిపారు. పంటసాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో, క్షేత్రస్థాయిలో వాస్తవ సమాచారం పంచుకోవడంలో కొంత జాప్యం జరుగుతోందని గుర్తించామన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయిలో ఒక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

రైతు సహాయ కేంద్రాల సిబ్బంది, హార్టికల్చర్ ఫీల్డ్ విస్తరణాధికారులు, ఐదు ప్రధాన కంపెనీల ప్రతినిధులకు పెదవేగి ఆయిల్ ఫామ్ పరిశోధన కేంద్రం సహకారంతో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ప్రతినెలా సమావేశమై సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పురుగుల నివారణకు వాడాల్సిన ఎరువులు, డ్రిప్ ఇరిగేషన్ వంటి అంశాలపై కూడా అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు.

గత ప్రభుత్వం ఆయిల్ ఫామ్ రైతులకు ఒక్క రూపాయి కూడా సబ్సిడీ ఇవ్వకుండా మోసం చేసిందని, అలాగే ఆయిల్ ప్రొడ్యూసర్లను కూడా మోసం చేసి సుమారు రూ. 54 కోట్లు బకాయిలు పెట్టిందని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు.

# హైదరాబాద్‌లో గూగుల్ సంస్థకు మా ‘వాళ్లే’ పోటీ!

- మొదటి పేజీ తరువాయి

అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్‌లో గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను (జీఎస్ఈసీ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచం వేగంగా డిజిటల్ యుగం వైపు పయనిస్తోందని, ఈ నేపథ్యంలో డిజిటల్ సమాచార భద్రత ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రజల డిజిటల్ సమాచారం సురక్షితంగా ఉన్నప్పుడే వారు క్షేమంగా ఉన్నట్లు భావించాలని ఆయన అభిప్రాయపడ్డారు.హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. డిజిటల్ భద్రతను పెంపొందించడమే ఈ కేంద్రం యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.“గూగుల్ ఒక ఇన్నోవేటివ్ కంపెనీ, మా ప్రభుత్వం కూడా ఇన్నోవేటివ్‌గానే పని చేస్తుంది. రాష్ట్రంలో యువత నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం” అని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా మారుతోందని, అందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణమని వివరించారు.రాష్ట్ర ఆర్థిక ప్రగతి లక్ష్యాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. “2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం” అని ఆయన పేర్కొన్నారు.‘తెలంగాణ రైజింగ్’ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. “ఇక్కడి మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకుండా, ధనిక పెట్టుబడిదారులకు దీటైన పోటీదారులుగా ఎదుగుతున్నారు. ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు, వినూత్న విధానాలు తీసుకొస్తున్నాం” అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

# ఇజ్రాయెల్ అంతు చూస్తాం.. అడ్డువస్తే అమెరికాను వదలం..

- మొదటి పేజీ తరువాయి

గుప్పించారు. ఇజ్రాయెల్ పై దాడి చేస్తే..ఇరాన్ పై సైనిక చర్యలుంటాయని అమెరికా హెచ్చరించిన కొద్ది గంటల్లో ఇరాన్ సుప్రీం ఖమేనీ తీవ్రస్థాయిలో కౌంటర్ ఇచ్చారు. ఇరాన్ ఒత్తిడికి తలొగ్గదని ప్రకటించిన ఖమేనీ.. ఇటీవల దాడులతో ఇజ్రాయెల్ పెద్ద తప్పు చేసిందని అన్నారు. ఇజ్రాయెల్ దురాక్రమణకు శిక్ష తప్పదని అన్నారు. ఇజ్రాయెల్ చాలా పెద్ద తప్పు చేసింది. ఇజ్రాయెల్ పాలకులపై ఎట్టి పరిస్థితుల్లో దయచూపం..శిక్ష అనుభవించి తీరాల్సిందే అన్నట్లుగా ఓ టెలివిజన్ ప్రసంగంలో ఖమేనీ ఇజ్రాయెల్, అమెరికాకు వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని ట్రంప్ చెప్పిన కొన్ని గంటల్లోనే ఈ వ్యాఖ్యలు చేయడంలో మిడిల్ ఈస్ట్ లో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. మూడో ప్రపంచం యుద్ధం తప్పదన్నట్లు కనిపిస్తున్నాయి అక్కడి పరిస్థితులు.

# కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరించండి

- మొదటి పేజీ తరువాయి

హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. “రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అక్కడి ప్రజల చిరకాల కోరిక. అందువల్ల కర్నూలులో ధర్మాసనం ఏర్పాటుకు సహకరించండి. న్యాయపరమైన అవసరాల కోసం ప్రస్తుతం రాయలసీమ ప్రజలు 500 కి.మీ. పైగా ప్రయాణించి రాజధానికి రావాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించడానికి కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేయాలని యువగళం పాదయాత్ర సందర్భంగా రాయలసీమ ప్రజలు, న్యాయవాదులు కోరారు. వారి ఆకాంక్షలను నెరవేర్చడానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలి. అలాగే రాష్ట్రంలో న్యాయవ్యవస్థలో మౌలిక వసతుల అభివృద్ధికీ కేంద్రం సహకారం అందించాలి” అని కోరారు.

### లోకేశ్‌కు హోంమంత్రి అమిత్‌షా అభినందన

అంతకుముందు మంత్రి లోకేశ్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంలో సాధించిన విజయాలు, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అమలు చేస్తున్న పనుల పురోగతి గురించి వివరించారు. ఈనెల 21న ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో జరగబోయే అంతర్జాతీయ యోగా కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్ల గురించి చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిని వివరించి కొత్త ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని కోరారు. యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని అమిత్‌షాకు అందజేశారు. దాన్ని పరిశీలించిన హోంమంత్రి సుదీర్ఘ పాదయాత్రతో ప్రజల్లో చైతన్యాన్ని నింపారంటూ లోకేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు పాలనానుభవం రాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో నడిపిస్తుందని, డబుల్ ఇంజిన్ సర్కార్‌కు కేంద్ర సహకారం కొనసాగుతుందని భరోసా ఇచ్చారు.

### అమరావతి పనులపై ఉపరాష్ట్రపతి ఆరా

మంత్రి లోకేశ్ తన రెండురోజుల దిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం తొలుత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిశారు. రాష్ట్రంలో ఏడాదికాలంలో ఎన్డీయే కూటమి సాధించిన పురోగతిని వివరించి మరింత వేగవంతమైన అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు, సూచనలు అందించాలని ఉపరాష్ట్రపతిని కోరారు. దేశంలోనే తొలిసారిగా అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు గురించి ఆయనకు వివరించారు. అందుకు ఉపరాష్ట్రపతి స్పందిస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారని అభినందించారు. రాజధాని అమరావతి పనుల పురోగతి పైనా ఆయన ఆరాతీశారు.

# ఫోన్ ట్యాపింగ్ పచ్చి నిజం

- మొదటి పేజీ తరువాయి

ఒప్పుకొంటారా? అన్న ప్రశ్నకు బదులిస్తూ.. జగన్ తన మేనల్లుడు, మేనకోడలి ఆస్తి కాజేసే అంశంలో వైవీ సుబ్బారెడ్డితో అబద్ధాలు చెప్పించారని, ఇలాంటి పరిస్థితుల్లో వైవీ ఒప్పుకొంటారని తాను అనుకోవట్లేదన్నారు.

### ఇద్దరు సీఎంల జాయింట్ ఆపరేషన్

‘ఆనాడు జగన్, కేసీఆర్ మధ్య మంచి సంబంధం ఉండేది. వాళ్లిద్దరి సంబంధం ముందు రక్తబంధం చిన్నబోయింది. అప్పట్లో ఇద్దరు ముఖ్యమంత్రులూ కలిసి చేసిన జాయింట్ ఆపరేషనే ఫోన్ ట్యాపింగ్. అప్పుడు వాళ్లిద్దరూ చేసిన అరాచకాల్లో ఇది చిన్న అంశం. అప్పటి పరిస్థితుల వల్ల మౌనంగా ఉండాల్సి వచ్చింది. తోడబుట్టిన చెల్లెలన్న విషయం మరిచిన జగన్... నేను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదని కుట్ర చేశారు. నా భవిష్యత్తును పాతిపెట్టాలని ఎన్నో చేశారు. ఇందులో భాగంగానే కుట్ర జరిగింది. నాకు మద్దతిచ్చిన వారిని బెదిరించారు. నా వాళ్లు రాజకీయంగా నా వెంట రాకుండా చేశారు. నా అనుచరులను భయభ్రాంతులకు గురిచేశారు. ఒక రకంగా నాకు ఊపిరాడని పరిస్థితి సృష్టించారు. నేను తెలంగాణలో పార్టీ పెట్టే విషయంతో జగన్‌కి ఏ సంబంధమూ లేదు. కేసీఆర్ కోసం నన్ను తొక్కిపెట్టాలని జగన్ చూశారు. నా ఎదుగుదలకు నేను పోరాడాను. నా ప్రతి పోరాటానికీ వాళ్లిద్దరూ అడ్డుపడ్డారు’ అని షర్మిల వ్యాఖ్యానించారు.

### దర్యాప్తు ముమ్మరం చేయాలి

‘రెండు రాష్ట్రాల్లోనూ ఆనాడు ఉన్న ప్రభుత్వాలు ఇప్పుడు లేవు. ప్రస్తుతం ఏపీలో చంద్రబాబు, తెలంగాణలో రేవంత్‌రెడ్డి సీఎంలుగా ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై వారు చర్యలు తీసుకోవాలి. నేను కేసు పెట్టాలనుకుంటే అప్పుడే పెట్టేదాన్ని. నా మీద జగన్ కేసు వేసినప్పుడే నేను కేసు వేసేదాన్ని. అమ్మకు ఇచ్చిన ఆస్తి విషయంలో కేసు వేసినప్పుడే నేను స్పందించేదాన్ని. నాకు వ్యక్తిగత పగ లేదు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ విషయంలో దర్యాప్తు ముమ్మరం చేయాలని కోరుకుంటున్నా’ అని షర్మిల అన్నారు.

# జగన్ పల్నాడు పర్యటనలో ఆంక్షలు ఉల్లంఘన .. ఎస్పీ కీలక వ్యాఖ్యలు

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో పర్యటించిన విషయం విదితమే. జగన్ పర్యటనలో వైసీపీ శ్రేణులు అత్యుత్సాహం ప్రదర్శించాయి. బైక్ ర్యాలీ నిర్వహించడంతో పాటు అనుచిత వ్యాఖ్యలతో కూడిన పోస్టర్లను ప్రదర్శించాయి. పోలీస్ నిబంధనలను ఉల్లంఘిస్తూ పర్యటన సాగింది.జగన్ జిల్లా పర్యటనపై పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ పల్నాడు పర్యటనకు ఆంక్షలతో కూడిన అనుమతులు ఇవ్వగా, ఆంక్షలకు పూర్తి విరుద్ధంగా కార్యక్రమం జరిగిందని ఎస్పీ తెలిపారు. పోలీసులుపై ప్రజా ప్రతినిధులు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు కూడా తీవ్రంగా ఏర్పడ్డాయని, ప్రజా ప్రతినిధులు సైతం వారి అనుచరులతో తిరిగారని పేర్కొన్నారు.వైసీపీ ఉల్లంఘనలపై న్యాయపరమైన అభిప్రాయం తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ఎస్పీ చేసిన ఈ వ్యాఖ్యల నేపథ్యంలో, జగన్ పర్యటనలో నిబంధనల ఉల్లంఘనపై వైసీపీ నేతలపై ఒకటి రెండు రోజుల్లో కేసులు నమోదయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# బనకచర్ల అన్యాయంపై ఉత్తమ్ వద్ద సమాధానం లేదు

- మొదటి పేజీ తరువాయి

కుమార్ రెడ్డి వ్యవహార శైలిపై అర్వింద్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. “ఉత్తమ్ కుమార్ రెడ్డి సగం కాంగ్రెస్, సగం బీఆర్ఎస్ వ్యక్తిలా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి దర్శకత్వంలోనే తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ఇదంతా కేవలం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆడుతున్న నాటకం” అని అర్వింద్ ఆరోపించారు. బీజేపీ మీద బురద చల్లేందుకే ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపైనా అర్వింద్ స్పందించారు. “నన్ను సిట్ విచారణకు పిలిచినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు. నాకు ఎలాంటి నోటీసులు అందలేదు. అసలు మహేశ్ కుమార్ గౌడ్ ఫోన్‌ను ఎందుకు ట్యాపింగ్ చేశారో అర్థం కావడం లేదు” అని అర్వింద్ వ్యాఖ్యానించారు. బనకచర్ల విషయంలో వాస్తవాలు మాట్లాడకుండా, పవర్ పాయింట్ ప్రజంటేషన్లతో కాలయాపన చేయడం ద్వారా ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలని అర్వింద్ హితవు పలికారు.

# ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా బనకచర్లపై నిర్ణయం

- మొదటి పేజీ తరువాయి

తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ అంశంపై బుధవారం సాయంత్రం దిల్లీలో సీఆర్ పాటిల్‌తో కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోలవరం-బనకచర్ల లింకు ప్రాజెక్టును జలశక్తి మంత్రిత్వశాఖ నిబంధనలకు అనుగుణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని, అన్ని భాగస్వామ్య పక్షాలతో చర్చించాకే పారదర్శక పద్ధతిలో నిర్ణయం ఉంటుందని సీఆర్ పాటిల్ చెప్పారని పేర్కొన్నారు.హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మెట్రో రెండోదశ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బుధవారం దిల్లీలో పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి చర్చించారు. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో తెలంగాణలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించీ మాట్లాడారు. మెట్రో రెండోదశ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపిన డీపీఆర్ ఇటీవలే తమకు అందిందని, అధికారులు పరిశీలిస్తున్నారని మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుత డీపీఆర్ పంపి ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకారం అందిస్తుందని ఆయన చెప్పారు.

# రేవంత్ రెడ్డి ఆ పని చేస్తేనే నామినేషన్లు వేయనిస్తాం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి తీవ్రస్థాయి లో విమర్శలు గుప్పించారు. బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి రాకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని, లేనిపక్షంలో ఎన్నికలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. “ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లకు అనుమతి తీసుకువస్తేనే నామినేషన్లు వేయనిస్తాం. లేదంటే ప్రతి వార్డులో వందల సంఖ్యలో నామినేషన్లు వేసి ఎన్నికల ప్రక్రియను నిలుపుదల చేస్తాం” అని కవిత అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ, మండలిలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపామని, పార్లమెంటులో ఈ బిల్లును కేంద్రం ఆమోదించకపోతే దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆమె తెలిపారు. “జులై రెండో వారం వరకు కేంద్రానికి గడువు ఇస్తున్నాం. ఆలోపు అనుమతి రాకపోతే జులై 17 నుంచి రైలు రోకోలు నిర్వహిస్తాం” అని కవిత హెచ్చరించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు, బొల్లాపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అడ్డుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుల వల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం చేపట్టిన “ఆపరేషన్ కగార్” పైన కూడా ఎమ్మెల్సీ కవిత స్పందించారు. ఈ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరపాలని ఆమె కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఎన్‌కౌంటర్లు అమానవీయ చర్యలని, ఈ ఆపరేషన్‌ను తమ పార్టీతో పాటు తెలంగాణ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని కవిత పేర్కొన్నారు. మావోయిస్టు సమస్యకు చర్చలే పరిష్కారమని ఆమె అభిప్రాయపడ్డారు.

# రూ.3 వేలకు వార్షిక టోల్‌పాస్

- మొదటి పేజీ తరువాయి

ఒక్కో టోల్‌గేట్‌ను ఒక్కో ట్రిప్పుగా లెక్కిస్తారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లేవారు 4 టోల్‌గేట్లను దాటాల్సి ఉంటుంది. అంటే వారు నాలుగు ట్రిప్పులను పూర్తి చేసినట్లుగా లెక్కిస్తారు. తిరిగి వస్తే మరో నాలుగు ట్రిప్పులుగా లెక్కిస్తారు. అంటే హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లి రావడానికి 8 ట్రిప్పులు అవుతాయి.

ఈ పాస్‌లను ఛాసిస్ నంబరు ఆధారంగా కాకుండా.. వాహన రిజిస్ట్రేషన్ నంబరు ద్వారానే జారీ చేస్తారు.వార్షిక పాస్ తీసుకోవడం తప్పనిసరేమీ కాదు. తక్కువ ట్రిప్పులు తిరిగేవారు, ఒకేసారి రూ. 3వేలు చెల్లించడానికి ఇష్టపడనివారు ప్రస్తుతం అమల్లో ఉన్న ఫాస్టాగ్ విధానాన్ని కొనసాగిస్తూ టోల్‌గేట్లలో వసూలు చేసే ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. దేశవ్యాప్తంగా 1,063 టోల్‌ప్లాజాలున్నాయి. వాటి సంఖ్య ఏపీలో 72గా, తెలంగాణలో 36గా ఉంది. 2024 డిసెంబరు 1 నాటికి దేశంలో 10.1 కోట్ల ఫాస్టాగ్‌లను వాహనదారులు తీసుకున్నారు.ఫాస్టాగ్‌ల ద్వారా జాతీయ రహదారులపై రోజుకు సగటున రూ. 200 కోట్ల ఆదాయం వస్తోంది. టోల్‌ప్లాజాల ద్వారా వెళ్లే వాహనాల్లో 53శాతం కార్లు, జీపులు, వ్యాన్లు ఉంటున్నాయి. సగటున రూ. 7 వేల లాభం

# నిబంధనల ప్రకారం పకడ్బందీగా గురుకులాలల నిర్వహణ...

- డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు
- గ్రామీణ ప్రాంతాలలో నూతన బస్సు రూట్ సర్వీస్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- గురుకులాల్లో మంజూరైన సీట్లను పూర్తి స్థాయిలో నింపాలి
- ప్రతి గురుకులంలో తప్పనిసరిగా దోమల మెష్ జాలి ఏర్పాటు చేయాలి
- గురుకులాలను రెగ్యులర్ గా ఉన్నతాధికారులు తనిఖీ చేయాలి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అధికారులతో వివిధ పథకాలపై రాష్ట్ర బిసి సంక్షేమం, రవాణా శాఖల మంత్రితో కలిసి సమీక్షించిన డిప్యూటీ సిఎం.




**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ -18:**ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పక్కాగా గురుకులాలను నిర్వహించాలని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

బుధవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అధికారులతో వివిధ పథకాలపై రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి సమీక్షించారు.

గురుకులాల నిర్వహణ, స్టడీ సర్కిల్ పని తీరు, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా శాఖ, విద్యుత్ శాఖ పని తీరు, చేపట్టిన అభివృద్ధి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సంబంధిత అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గురుకులాల పాఠశాలల ప్రారంభం నాటికి పిల్లలకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు పంపిణీ చేయాలని, దీనికి అవసరమైన నిధులు ముందుగానే విడుదల చేయడం జరిగిందని అన్నారు. సరైన వసతులు లేని గురుకులాల భవనాలను అవకాశం ఉన్నచోట ప్రత్యామ్నాయ భవనాలకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

గురుకుల పాఠశాలల్లో పిల్లలకు దోమలు కుట్టి ఇబ్బంది పడటానికి వీలు లేదని, ప్రతి గురుకులంలో పూర్తి స్థాయిలో మెష్ జాలీ లు ఏర్పాటు చేయాలని అన్నారు. హాస్టల్స్ లో అవసరమైన మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని అన్నారు. 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని అన్నారు. కామన్ డైట్ ప్రోగ్రాం సంబంధించి షెడ్యూల్ తప్పనిసరిగా డిస్ ప్లే చేయాలని అన్నారు.

జిల్లాలో కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు గురుకులాలను రెగ్యులర్ గా తనిఖీ చేయాలని, దీనికి సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని అన్నారు. గురుకులాల పరిసరాల్లో పండ్ల మొక్కలను పెద్ద స్థాయిలో పెంచాలని, దీనివల్ల పచ్చదనం పెరగడంతో పాటు విద్యార్థులకు కూడా పౌష్టికాహారం అందుతుందని అన్నారు.

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో కోటి మొక్కల వరకు పెంచుతున్నామని అన్నారు. ప్రతి మొక్క మీద ప్రభుత్వం కనీసం 300 రూపాయల వరకు ఖర్చు చేస్తుందని, ఒక జిల్లాలో సంవత్సరానికి 300 కోట్లు ఖర్చు చేస్తున్నామని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సర్వైవల్ పై శ్రద్ధ పెట్టాలని అన్నారు. గతంలో నాటిన మొక్కలలో ఎన్ని బ్రతికాయో వాస్తవిక రిపోర్ట్ అందించాలని అన్నారు.

గురుకులాల భవనాలకు సంబంధించి రెంట్, డైట్ చార్జీల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం విడుదల చేస్తుందని, పిల్లలకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు.

మహిళలకు ఉచిత బస్సు అందించడంతో పాటు అది సౌకర్యవంతంగా ఉండేలా మనం చర్యలు చేపట్టామని, డిమాండ్ ఉన్న రూట్ లలో అదనపు బస్సులు నడపాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నూతన బస్సు రూట్ లను గుర్తించి ప్రతిపాదనలు అందిస్తే నూతన బస్సులు కొనుగోలు చేసి పంపడం జరుగుతుందని అన్నారు.

సమీక్ష లో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో గురుకులాలలో చేపట్టిన చర్యలు, గీత కార్మికులకు కాటమయ్య రక్షక కిట్లను పంపిణీ, వన మహోత్సవం కార్యక్రమంలో తాటి, ఈత ఖర్జూర మొక్కల పెంపకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటివి సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

గురుకులాల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగ్గు పర్చాల్సిన అవసరం ఉందని, ఐఐటి, నీట్ వంటి పరిక్షలలో మంచి ఫలితాలు సాధించేలా శిక్షణ అందించాలని అన్నారు. పెరిగిన డైట్ చార్జీలు వినియోగిస్తూ ప్రభుత్వం సూచించిన కామన్ డైట్ కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని అన్నారు.

గురుకులాలో మంజూరైన సీట్లు పూర్తి స్థాయిలో నింపాలని, సొంత భవనాలు లేని గురుకులాలకు అవసరమైన భూమి గుర్తించాలని, ప్రభుత్వం దగ్గర అందుబాటులో ఉన్న నిధుల ప్రకారం నిర్మించడం జరుగుతుందని తెలిపారు.

గ్రామీణ యువతకు ఖమ్మం జిల్లా హెడ్ క్వార్టర్ లో బీసీ స్టడీ సర్కిల్ నందు శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించేలా చూడాలని అన్నారు. హైదరాబాద్ కు రావాల్సిన అవసరం లేకుండా అవసరమైన అన్ని రకాల పుస్తకాలు, శిక్షణ మన ఖమ్మంలో అందించాలని అన్నారు.

ప్రస్తుత సంవత్సరం వన మహోత్సవం కార్యక్రమంలో 81 వేల ఈత మొక్కలు నాటేందుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేయాలని, గీత కార్మికుల సోసైటీ లను వీటిలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి రివ్యూ చేస్తూ కాలువల వెంబడి, ఖాళీ ఉన్న ప్రభుత్వ స్థలాల్లో వీటిని పెద్ద ఎత్తున పెంచాలని అన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత నూతన బస్సు సర్వీసుల కోసం డిమాండ్ వస్తుందని,స్థానిక ఎమ్మెల్యేల నుంచి బస్సు సర్వీసుల ప్రతిపాదనలు తీసుకొని అందించాలని, డిమాండ్ కు అనుగుణంగా అదనపు బస్సులను కేటాయిస్తామని, రాబోయే రోజులలో హైదరాబాద్ కు ఎలక్ట్రిక్ బస్సులు వచ్చే నేపథ్యంలో జిల్లాలకు అదనపు బస్సులు అందుతాయని మంత్రి తెలిపారు. నగర పరిధిలో పీఎంఈ స్కీం కింద ఎలక్ట్రిక్ బస్సుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని పరిశీలించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రూరల్ కనెక్టివిటీ బస్సుపై స్టడీ చేసి నూతన రూట్ లను ప్రతిపాదించాలని అన్నారు. లాండ్రీ లకు, దోబి ఘాట్, సెలూన్ లకు విద్యుత్ సరఫరా సజావుగా అందాలని అన్నారు. గురుకులాల పరిధిలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్త కళా చైర్మన్ నాయుడు సత్యనారాయణ, నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఉమ్మడి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిరంతరాయ విద్యుత్ సరఫరాకు పటిష్ట చర్యలు...

- డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు
- 1912 కు ఫోన్ చేస్తే విద్యుత్ సమస్య పరిష్కారం
- 20 వేల మెగా వాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా చర్యలు
- విద్యుత్ అంబులెన్స్ ల ఆవిష్కరణ, విద్యుత్ ఉద్యోగుల హెల్త్ క్యాంపును ప్రారంభించిన డిప్యూటీ సిఎం.



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ -18:**రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

బుధవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు, ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, టీ.జి. ఎన్.పి.డి. సి.ఎల్. సిఎండి కె. వరుణ్ రెడ్డి లతో కలిసి విద్యుత్ అంబులెన్స్ లను ఆవిష్కరించి, విద్యుత్ ఉద్యోగుల హెల్త్ క్యాంపును ప్రారంభించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ వరదల సమయంలో ఎవరు ఊహించని వేగంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేసిన సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుత్ శాఖలో పారదర్శకత తీసుకొని వచ్చిందని, విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు సమయం కేటాయిస్తామని అన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ సరఫరా చాలా కీలకమని, మన దగ్గర నిరంతరాయ విద్యుత్ సరఫరా అన్ని వర్గాలకు అందించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టామని, సాంకేతిక సమస్యలు, వాతావరణ పరిస్థితుల వల్ల విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడినప్పుడు మరమ్మత్తు పనులు చేసే సమయంలో కార్మికులకు ప్రమాదాలు జరగకుండా తప్పని సరిగా భద్రతా చర్యలు పాటించాలని అన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ శాఖలో పనిచేసే లైన్ మేన్ నుంచి సీఎండి వరకు కోటి రూపాయల ప్రమాద భీమా కల్పించడం జరిగిందని అన్నారు. కే.టి.పి.ఎస్. స్టేజి 7 వరకు, హైడల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మొత్తం గత ఉమ్మడి రాష్ట్ర హయాంలో ఏర్పాటు చేశామని అన్నారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన విద్యుత్ పాలసీ తీసుకొని వచ్చామని తెలిపారు. 2023 లో 15 వేల మెగావాట్ల విద్యుత్ పీక్ డిమాండ్ ఏర్పడిందని, 2025 మార్చి లో ఇది 17 వేల 162 మెగా వాట్లకు చేరుకున్నప్పటికీ ఎక్కడ విద్యుత్ కోతలు కాకుండా చూసుకున్నామని అన్నారు.

2029-30 నాటికి 26 వేల మెగా వాట్ల, 2034-35 నాటికి 33 వేల 773 మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడుతుందని అంచనాతో విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని, లక్ష కోట్ల రూపాయల వరకు ఇప్పటికే సోలార్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ఎంఓయూ చేసుకున్నామని అన్నారు.

బ్యాటరీ స్టోరేజ్ వంటి నూతన విద్యుత్ ఉత్పత్తి రంగాలను కూడా పరిశీలిస్తున్నా మని అన్నారు. వ్యవసాయ పంప్ సెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం 11 వేల 500 కోట్ల చెల్లిస్తుందని అన్నారు. గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా కోసం ప్రజా ప్రభుత్వం 2293 కోట్లను విద్యుత్ శాఖకు చెల్లించిందని అన్నారు.

ప్రతి సంవత్సరం అన్ని వర్గాలు కలిపి దాదాపు 14 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించిందని అన్నారు. 1912 ఫోన్ నెంబర్ కు ఫోన్ చేస్తే విద్యుత్ అంబులెన్స్ వచ్చి మరమ్మత్తు పనులు పూర్తి చేస్తుందని, అంబులెన్స్ లో అవసరమైన సామాగ్రి, ఇంజనీర్, ట్రాన్స్ఫార్మర్ అందుబాటులో ఉంటాయని అన్నారు.

ఈ సందర్భంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సామాన్యుల జీవన ప్రమాణాలు పెరిగేందుకు విద్యుత్ శాఖ పని తీరు కీలకమని అన్నారు.

ప్రజా ప్రభుత్వం ఆకాంక్షలకు అనుగుణంగా విద్యుత్ శాఖ సిబ్బంది వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. ఆర్టిసి కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే కోటి రూపాయల బీమా వస్తుందని, విద్యుత్ శాఖలో కూడా ఈ పథకం అమలు అవుతుందని, మిగిలిన శాఖలలోని ఉద్యోగులకు కూడా ఇది అమలు చేయాలని అన్నారు.

టిటీ.జి. ఎన్.పి.డి. సి.ఎల్. సిఎండి కె. వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, గత సంవత్సరం సెప్టెంబర్ లో వచ్చిన వరదల సమయంలో ఖమ్మం సర్కిల్ పరిధిలో 30 కోట్ల రూపాయల మేర నష్టం జరిగిందని, విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనిచేసి వారం రోజులలో ప్రతి గ్రామంలో విద్యుత్ సరఫరా పునర్వ్యవస్థీకరించారని తెలిపారు.

ఓవర్ లోడింగ్ సమస్య ఉన్న దగ్గర నూతన లైన్స్, ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నామని, వేసవి కాలంలో అత్యధికంగా డిమాండ్ వచ్చినప్పటికీ ఎక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేసుకున్నామని అన్నారు.

1912 ద్వారా వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు విద్యుత్ అంబులెన్స్ దోహదపడతాయని, ప్రతి అంబులెన్స్ లో సిబ్బందితో పాటు అడ్వాన్సు టూల్ కిట్ అందుబాటులో ఉంటుందని అన్నారు.

విద్యుత్ సిబ్బందికి కోటి రూపాయల ప్రమాద భీమా అందించడంతో పాటు వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, ప్రతి సిబ్బందికి అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని అన్నారు.

అనంతరం ఎలక్ట్రికల్ సేఫ్టీ టూల్ కిట్లను విద్యుత్ సిబ్బందికి మంత్రి అందజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్.ఈ. ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ప్రజా ప్రతినిధులు, విద్యుత్ శాఖ సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 23 నా సర్దార్ నగర్ గ్రామ తైబజార్ వేలంపాట

**సి కే న్యూస్ షాద్ నగర్:జూన్ 18:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సర్దార్ నగర్ గ్రామం యొక్క తైబజార్ వేలంపాట తేదీ 23/06/2025 నాడు ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు నిర్వహించబడుతుంది. ఈ తై బజార్ వేలంపాటలో పాల్గొనాలనుకునేవారు ప్రవేశ రుసుము 2000/- రూపాయలు %వాదీ×% బ్యాంకు సర్దార్ నగర్ నందు డిమాండ్ డ్రాఫ్ట తీసి సర్దార్ నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కు అందజేయగలరు.




## విహెచ్ పిఎస్ ఆధ్వర్యంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ కి సన్మాన కార్యక్రమం



**సి కె న్యూస్ జూన్ 18 బుధవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:**ధర్మసాగర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని విహెచ్పిఎస్ మండల అధికార ప్రతినిధి గంటే లక్ష్మి ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విహెచ్పిఎస్ జాతీయ కార్యదర్శి గడ్డం కాసిం పాల్గొని మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు ను స్వీకరించిన సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం శుభం కన్వెన్షన్ హాల్ నాగోల్ హైదరాబాదులో నిర్వహించబడును కావున ధర్మసాగర్ మండల కేంద్రంలోని వికలాంగులు అందరు హాజరై ఆ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బొట్ల సురేష్ విహెచ్పిఎస్ జాతీయ నాయకులు,
బొడ్డు రమణాకర్ మండల ప్రధాన కార్యదర్శి,
మాచర్ల సంధ్యారాణి బీహెచ్పీఎస్ మండల నాయకులు,
ఆరూరి లత బిహెచ్పిఎస్ మండల నాయకులు,
ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు గంగారపు శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి మండల ఇంచార్జి, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి,
బొడ్డు శాంతి సార్ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి,
గుడ్డు కమలాకర్ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, గంగారపు శ్రీను ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, మహిళ నాయకురాలు మాచర్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఏ ఇబ్బంది కలగకుండా కరకట్ట ప్రదేశం పరిశుభ్రంగా ఉంచాలి.

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 18,**
శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి వివిధ రాష్ట్రాల నుండి భక్తులు అధికంగా వచ్చి తప్పని సరిగా గోదావరిలో కుటుంబ సభ్యులతో కలిసి స్నానం చేసి దేవుని దర్శించుకుంటారని అందుకు కరకట్ట ప్రదేశాలన్నీ శుభ్రంగా ఉండేలా సంబంధిత గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ గ్రామపంచాయతీ ఈఓకు ఆదేశించారు.

బుధవారం గోదావరి కరకట్ట పక్కన భద్రాచలం పరిసర ప్రాంత ప్రజలు చెత్తను ఇష్టం వచ్చినట్టుగా పడవేయడంతో మంటలు చెలరేగిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఈఓకు సూచనలు ఇస్తూ తడి చెత్త కానీ పొడి చెత్త కానీ ఎవరు కరకట్ట ప్రదేశాలలో వేయకుండా గ్రామ పంచాయతీ సిబ్బందిని కాపలా ఉంచాలని, భద్రాచలం పట్టణం మరియు వార్డుల లో సేకరించిన చెత్తను కొత్తగా నిర్మాణం చేపట్టిన డంపింగ్ యార్డ్ లోనే వేయాలని అన్నారు. కరకట్ట పక్కన చెత్తను పడేయడం వలన దోమలు ప్రబలి భద్రాచలం ప్రజలు వివిధ రకాల వ్యాధులకు గురి అయ్యే అవకాశం ఉందని, అందుకు ప్రజలు కూడా గ్రామ పంచాయతీ సిబ్బందికి సహకరించి తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా మీ వద్దకు వచ్చే గ్రామ పంచాయతీ ట్రాక్టర్ లో మాత్రమే వేయాలని, ఎక్కడపడితే అక్కడ ఇష్టం వచ్చినట్టు పడవేయకూడదని అన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది తప్పనిసరిగా ప్రతి వార్డు ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించాలని ఆయన అన్నారు.

అనంతరం కరకట్ట పక్కన తగలబడి పోతున్న చెత్త ప్రాంతాన్ని ఫైర్ ఇంజన్ ద్వారా మంటలు ప్రబలకుండా అదుపు చేయించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఇఓ శ్రీనివాస్ గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న బీ అర్ యస్ పార్టీ కార్యకర్తను పరామర్శించిన :మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**పెబ్బేరు మున్సిపాలిటీ జూన్ /18 (సి కే న్యూస్)** పెబ్బేర్ పట్టణం 10 వ వార్డు కు చెందిన గోనెల రఘు తండ్రి గారు గోనెల రాములు గారికి బైపాస్ సర్జరీ చేయించారు ఇట్టి విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి మాజీ మంత్రి వర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకొని మనో ధైర్యం కల్పించారు.

మాజీ మంత్రి వెంట టౌన్ పార్టీ అధ్యక్షుడు దిలీప్ కుమార్ రెడ్డి పెబ్బేరు మాజీ వైస్ చైర్మన్ కర్రీ స్వామి , మాజీ జెడ్పీటీసీ వెంకటేష్, కౌన్సిలర్స్ చిన్న ఎల్లా రెడ్డి, గుడిసె వేణు , సహదేవుడు, సాయి రెడ్డి, సాప్పరి బీచుపల్లి, గోవిందు, వేణు, మన్యం, నరేష్, శాంతన్న, శంకర్ నాయుడు గోవర్ధన్ రెడ్డి ఎల్లయ్య,అఖిల్, గణేష్, వెంకటేష్,బీ అర్ యస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలి....

- ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ...
- ఎంపీడీవో రవీందర్



పెబ్బేరు జూన్18 (సి కే న్యూస్)రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో రవీందర్ సూచించారు.
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో 31మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి.బుధవారం పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో రవీందర్, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ కుమార్, ఇందిరమ్మ కమిటీ మెంబర్ బాపనపల్లి రమేష్ లతో కలిసి ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవీందర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం త్వరగా నిర్మించుకోవాలన్నారు.బేస్మెంట్ వరకు పూర్తి చేసిన ఇండ్లకు ప్రతి సోమవారం డబ్బులు చెల్లిస్తారన్నారు.లబ్ధిదారులు వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వం పేదలకు ఇండ్లు నిర్మించాలని సదుద్దేశంతో చేపట్టిన ఈ పథకం నిరంతరం కొనసాగుతుందని అన్నారు. ప్రస్తుతం మొదటి విడతలో ప్లాట్ ఉండి ఇండ్లు లేనివారిని లబ్ధిదారులుగా ఎంపిక చేశామని వివరించారు.రెండో విడతలో ప్లాట్ లేకుండా ఇండ్లు లేనివారిని ఎంపిక చేస్తామని వెల్లడించారు.ఆ తరువాత అర్హులైన మిగతా వారిని ఎంపిక జరుగుతుందన్నారు.మిగతా అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. లబ్ధిదారులకు విడుతల వారీగా డబ్బులు అందుతాయని తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొడుగు పెద్ద ఎల్లస్వామి,బండమీది లక్ష్మన్న,రాంపోగు ఆంజనేయులు,రామాంజనేయులు,దాది రాముడు,కావలి పెంటన్న,బాలకృష్ణ,కారోబార్ రాము తదితరులు పాల్గొన్నారు.

# జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి.....!

ఏజే రమేష్ సిఐటియు జిల్లా కార్యదర్శి.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,జూన్ 18,కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాల ను ఖండిస్తూ జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ కోరారు. బుధవారం స్థానిక చంద్రరావు భవనంలో జరిగిన సిఐటియు భద్రాచల పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి సిఐటియు పట్టణ నాయకులు కొలగాని రమేష్ అధ్యక్షత . వహించగా ఏ జె. రమేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తీసుకు వస్తున్న నాలుగు లేబర్ కోడ్లలో భాగంగా ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం 12 గంటల పని విధానాన్ని తీసుకువచ్చిందని, ఈ కోడ్లు అమలులోకి వస్తే ఉద్యోగులకు కార్మికులకు కనీస భద్రత ఉండదని కాబట్టి ఈ నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ దేశ వ్యాప్త సమ్మెలో అనేక కార్మిక ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతుందని చెప్పారు. ఈ సమ్మె జయప్రదం కోసం ఉద్యోగులు కార్మికులలో పారిశ్రామిక ప్రాంతాల లో విస్తృతమైన ప్రచారం నిర్వహించాలని ఏ. జె. రమేష్ కోరారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ అధ్యక్షుడు కే బ్రహ్మచారి, జిల్లా కోశాధికారి శ్రీమతి జి పద్మ, సిఐటియు భద్రాచల పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు ప్రసంగించారు. ఈ సమావేశంలో పి సంతోష్ కుమార్, ఎన్ నాగరాజు, ఎస్ అజయ్ కుమార్, డి రామకృష్ణ, కే ప్రతాప్, చంటి, ఎన్ వెంకటలక్ష్మి, పి శివమ్మ, యు రమా, ఎన్ సంతోష్, పి బాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంచర్ షాప్ ప్రారంభం

నిరుపేదలకు జీవనోపాధికి ఆర్థిక సహాయం అందజేస్తున్న కొప్పుల హరిదీప్ రెడ్డి




సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్
పల్లెర్ల గ్రామానికి చెందిన మంగ జానయ్య గత కొన్ని సంవత్సరాలనుండి చిన్న పంచర్ షాపు పెట్టుకొని జీవనం గడుపుతున్నాడు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో పెద్ద పంచర్ షాపు ఈరోజు ప్రారంభించడం జరిగింది మంగ జానయ్య కి పంచర్ షాపు డబ్బా చేయించి జీవనోపాధికి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా మంగ జానయ్య మాట్లాడుతూ నిరుపేదలకు అండగా ఉంటూ ఆపదలో ఉన్న వారికీ ఆర్థిక సహాయం అందజేస్తున్న కొప్పుల హరిదీప్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యాట వెంకన్న సోలిపురం వెంకట్ రెడ్డి,గుణవేణి స్వామి మంగ శ్రీనివాస్,పెసరకాయల నర్సిరెడ్డి, గుర్రం మల్లేష్ మేడి శ్రీనివాస్,దండు ప్రసన్న దండు రమేష్,యాట మల్లేష్ దండు నరేష్,మచ్చగిరి దండు హరీష్ దండు నవీన్,శశి కుమార్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన నిరుపేదలకు ఇండ్లు, రాజీవ్ యువ వికాస్ మంజూరు చేయాలి.

- మంజూరు చేయిస్తామంటూ కాంగ్రెస్ నాయకుల వసూళ్లు.
- త్వరలోనే ఎంపీడీవో కార్యాలయం ముట్టడి బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 18,రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని, ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఈ జాబితాను రూపొందించడంలో ఆంతర్యం ఏమిటని లివైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లకావత్ గిరిబాబు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ఇల్లు లేని వారికి, కిరాయి గృహాల్లో ఉన్న వారికి కాకుండా ఇందిరమ్మ కమిటీల పేరుతో మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకు అనుకూలంగా ఉన్న వారికే ఇల్లు మంజూరు చేస్తున్నారని, అర్హులైన లబ్ధిదారులను పక్కన పెడుతున్నారని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకి మండలం లో కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని సోషల్ మీడియా గ్రూపులలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే పోస్టులు పెడుతున్నారని అన్నారు. జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు తక్షణమే స్పందించి మండలంలో అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇల్లు %ం% రాజీవ్ యువ వికాస్ మంజూరు చేయాలని, వీటి ఎంపికలో అధికారులను బలి పశువులను చేయకుండా పూర్తి పారదర్శకతను పాటించాలని వారు డిమాండ్ చేశారు. మొదటి విడతలో ఎంపికైన జూలూరుపాడు పలు గ్రామపంచాయతీలో ఏఈ సమక్షంలో ముగ్గ పోసిన ఇంటికి బిల్లు రాకుండా అడ్డుకుంటున్నారని, 400 చదరపు అడుగుల నుండి 600 వరకు ఉండాలనే నిబంధనను తొలగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నిజమైన అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయకపోతే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు


# జీతాలు రాక అవస్థ పడుతున్న గ్రామపంచాయతీ కార్మికులు

- పట్టించుకోని అధికారులు ప్రజా ప్రతినిధులు
- పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు లేవు
- తక్షణమే జీతాలు విడుదల చేయాలని కార్మికుల డిమాండ్




సి కే న్యూస్ షాద్ నగర్:జూన్ 18:గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కీలకంగా పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు మూడు నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. తాము కష్టపడి పనిచేస్తున్నా వేతనాలు సమయానికి చెల్లించకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల చదువు, ఇంటి ఖర్చులు, దైనందిన అవసరాలు అన్నీ వాయిదా వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కొందరు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, మండల అభివృద్ధి అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇంకా ఫలితం లేదని వారు తెలిపారు. ప్రభుత్వ అధికారులు జీతాల జారీకి గణాంకాలు సేకరిస్తున్నామని చెప్పడం తప్ప చర్యలేవీ తీసుకోవడం లేదని ఆరోపించారు.మేము పని చేయాలి, జీతం కోసం కంగారుపడకూడదు. కానీ ఇప్పుడేమైందో తెలుసుకోవాలంటే అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అని ఓ పంచాయతీ కార్మికుడు వాపోయాడు.తక్షణమే జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు నిరసనకు సిద్ధమవుతున్నారు.ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో పనిచేసే కార్మికులను నిర్లక్ష్యం చేయకుండా వారి హక్కులను కాపాడాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# దివంగత జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ దశదినకర్మకు హాజరైన విజయ్ కుమార్



సి కె న్యూస్ షాద్ నగర్:జూన్ 18: జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే,హైదరాబాద్ అధ్యక్షులు దివంగత మాగంటి గోపీనాథ్ దశదినకర్మకు హాజరై,వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర బీసీ కార్యదర్శి. కేటీఆర్ సీన రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ జి విజయ్ కుమార్.

# యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి


- మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు



చౌటుప్పల్.జూన్18. సి కే న్యూస్ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా యువత స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని చౌటుప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో విజయవాడ హైవేలో చౌటుప్పల పద్మావతి ఫంక్షన్ హాల్, బిఈడి కాలేజ్ ఆవరణంలో అరిటాకు భోజన హోటల్ ప్రారంభోత్సవంను స్థానిక నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెన్ రెడ్డి రాజు మాట్లాడుతూ... యువత ప్రైవేట్ రంగాలలో అంది వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ,మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.గోగినేని కృష్ణ తేజను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ బత్తుల శ్రీశైలం, తెలుగుదేశం పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇన్చార్జి బడుగు లక్ష్మయ్య, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, పెద్దిటి బుచ్చిరెడ్డి, గుమ్మడి అంజిరెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ టిడిపి అధ్యక్షులు సుంకర జంగయ్య గౌడ్, టిడిపి మండల్ ప్రధాన కార్యదర్శి వర్కాల వెంకటేశం గౌడ్, టిఆర్ఎస్ నాయకులు భూమిరెడ్డి వెంకట్రెడ్డి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల బిక్షపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొబ్బిళ్ళ మురళి,ఉడుగు రమేష్, టిడిపి సీనియర్ నాయకులు ముత్యాల పాపిరెడ్డి, నల్ల పర్వతాలు యాదవ్, గోవిందా చారి, తడక కోటేష్, కామిశెట్టి చంద్రశేఖర్, తూర్పునూరి నరసింహ గౌడ్, సుర్వి నరసింహ గౌడ్, బొడిగ బాలకృష్ణ, జరంకి రవి, టీడీపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి సిలివెరు రాజు, మున్సిపల్ తెలుగు యువత అధ్యక్షులు బోదుల గణేష్, ముత్యాల ప్రభాకర్ రెడ్డి, తాడూరు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట సమస్యలను పరిష్కరించాలి

- టీయూడబ్ల్యూజే( ఐజేయు) మండల అధ్యక్షులు పడమటి దామోదర్ రెడ్డి.



సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 18.
జర్నలిస్టులకు ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఐజేయు ) మండల అధ్యక్షుడు ప నుమటి దామోదర్ రెడ్డి అన్నారు బుధవారం మండల కేంద్రంలోని ఐజేయూ మండల కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వం ప్లాట్లు ఇండ్లు మంజూరు చేయాలన్నారు జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ లో వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజుల్లో 50% రాయితీ ఇవ్వాలని ఆయన కోరారు ఈ సమావేశంలో జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు దూలం శ్రీనివాస్ మండలం ప్రధాన కార్యదర్శి మధు బాబు జిల్లా నాయకులు రాపోలు సుదర్శన్ పలుసం మైసయ్య బాలరాజు నాగలి వలి దంతూరు గోపి మల్లేశం బాలరాజు

# దాతృత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు



సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్) జూన్18
చౌటుప్పల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998- 99 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన విద్యార్థులు తమతో చదువుకున్న చిన్ననాటి స్నేహితుడైన లింగారెడ్డిగూడెం కు చెందిన పుర్రు యాదయ్య గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురై కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇట్టి విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు 50 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈకార్యక్రమంలో తోర్పునూరి నరసింహ, సంద గల్ల సతీష్, చిక్క నరసింహ, ఉడుగు కృష్ణ, జోర్క నాగరాజు, ఉదరి గణేష్, ఉష్కాగుల వెంకటేష్, గజం అశ్విని కుమార్, బాతరాజు సైదులు, కత్తుల రవి, స్వామి, రవి, బొజ్జ రాంబాబు, పూర్వ విద్యార్థులందరూ పాల్గొన్నారు.

## డసాల్ట్ సంస్థతో అనిల్ అంబానీ కంపెనీ డీల్.. ఫాల్కన్ జెట్స్ తయారీ.. దూసుకుపోతున్న స్టాక్



అనిల్ అంబానీ ఇదొక ఫెయిల్డ్ బిజినెస్ మెస్ స్టోరీ అంటూ గతంలో వార్తలు వచ్చేవి. కానీ ప్రస్తుతం ఆయన ప్రయాణం లక్షల మంది యువ వ్యాపారవేత్తలకు మార్గదర్శకంగా మారుతోంది. పడటం కాదు దాని నుంచి తిరిగి ఎలా లేవాలి, ఎలా నిలదొక్కుకోవాలి అనే అంశాలను అనిల్ జీవితం అందిస్తోంది. వ్యాపారవేత్తగా తన రెండవ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన అంబానీ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులు, విజయాలతో ముందుకు సాగుతున్నారు. తాజాగా అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్ ఫ్రా సంస్థ రఫెల్ యుద్ధ విమానాల తయారీ సంస్థ డసాల్ట్ ఏవియేషన్ సంస్థతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దీని కింద కంపెనీ అనుబంధ సంస్థ రిలయన్స్ ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఫ్రెంచ్ సంస్థ డసాల్ట్ ఏవియేషన్ మధ్య డీల్ జరిగింది. దీనికింద డసాల్ట్ సంస్థకు చెందిన ఫాల్కన్ 2000 బిజినెస్ట్ జెట్లను సంయుక్తంగా భారతదేశంలో తయారు చేసేందుకు ఇరు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ వార్త బయటకు రావటంతో రిలయన్స్ ఇన్ ఫ్రా సంస్థ షేర్లు నేడు 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ తాకాయి. ఒప్పందం కింద డసాల్ట్ సంస్థ తొలిసారిగా భారతదేశంలో తన ఫాల్కన్ విమానాలను అసెంబుల్ చేయాలని నిర్ణయించింది. ఫ్రాన్స్ బయట వీటిని అమెరికా, కెనడా, బ్రెజిల్ లో ఉత్పత్తి చేస్తుండగా ఈ జాబితాలోకి భారత దేశం కూడా అంబానీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా ఎంట్రీ ఇచ్చింది. 2028 చివరి నాటికి కార్పొరేట్, సైనిక అవసరాల కోసం డసాల్ట్ మేడ్ ఇన్ ఇండియా ఫాల్కన్ 2000 జెట్స్ డెలివరీని మ్నొదలుపెట్టే లక్ష్యంతో తాజా డీల్ జరిగింది. రిలయన్స్ ఇన్ ఫ్రా సంస్థ వరుసగా డిఫెన్స్ రంగంలో అనేక ప్రాజెక్టులను చేపడుతూ వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది. దీని ఫలితంగా గడచిన ఏడాది కాలంలో కంపెనీ షేర్లు ఏకంగా 83 శాతం పెరిగి ఇన్వెస్టర్లకు భారీ రాబడులను అందించాయి. అలాగే కంపెనీ షేర్లు 2025 ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 20 శాతానికి పైగా రాబడిని అందించాయి. కంపెనీ షేర్ల 52 వారాల గరిష్ఠ ధర రూ.421 వద్ద ఉండగా.. నేడు మార్కెట్లు ముగిసే సమయంలో స్టాక్ ధర ఒక్కోటి రూ. 386.50 వద్ద తన ప్రయాణాన్ని ముగించింది.

## బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్.. హాజరుకాని కిషన్ రెడ్డి, బండి సంజయ్

ఏపీ చేపడుతోన్న బనకచర్ల ప్రాజెక్టుపై అఖిలపక్ష ఎంపీలతో తెలంగాణ సచివాలయంలో ఇరిగేషన్ శాఖ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తోంది. బనకచర్ల వల్ల తెలంగాణకు జరిగే నష్టాన్ని వివరిస్తున్నారు ఇరిగేషన్ అధికారులు. సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్,రేణుకా చౌదరి,ఎంపీ చామల, ఓవైసీ, బీజేపీ నుంచి డీకే అరుణ,రఘునందన్ రావు, బీఆర్ఎస్ నుంచి రవిచంద్రన్ హాజరయ్యారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ హాజరు కాలేదు. ఈ సందర్బంగా మాట్లాడిన ఉత్తమ్.. బనకచర్లపై కేంద్రానికి ఏపీ ఫ్రీ ఫిజిబులిటీ సమర్పించిందన్నారు.ఏపీ పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘించిందని చెప్పారు.అన్ని పార్టీలను మేము సంప్రదించాం.. బనకచర్లపై అన్ని పార్టీల ఎంపీల అభిప్రాయాలు కీలకమన్నారు. సీఎం సూచనలతో అఖిలపక్ష ఎంపీల సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు.

## రెండో బిడ్డకు జన్మనిచ్చిన టాలీవుడ్ హీరోయిన్?.. పోస్ట్ పెట్టింది సరే.. ఎందుకింత సీక్రెట్?




టాలీవుడ్ బ్యూటీ ఇలియానా క్రేజ్ ఎలాంటిదో అందరికీ తెలిసిందే. తెలుగుతో పాటు తమిళ, హిందీ, కన్నడలో పలు మూవీస్ చేసి స్టార్ డం సంపాదించుకుంది. ఇప్పుడీ ఈ బ్యూటీ సినిమాలకు దూరంగా ఉంటూ ఫ్యామిలీ లైఫ్ లీడ్ చేస్తోంది. ఇలియానా పోర్చుగీసుకి చెందిన వ్యాపార వేత్త మైఖేల్ డోలన్?ను పెళ్లాడిన విషయం తెలిసిందే. ఈ జంటకి ఆగస్టు 2023 సంవత్సరంలో కొడుకు పుట్టాడు. ఇక ఇటీవల ఆమె రెండోసారి కూడా తల్లి కాబోతోందని వార్తలొచ్చాయి. అయితే, ఇటీవలే ఫాదర్స్ డే సందర్భంగా ఓ పోస్ట్ పెట్టి అందరికీ సర్ప్రైజ్ ఇచ్చింది.అందులో తన భర్త డోలన్.. పసికందును ముద్దాడుతున్న ఫొటోను షేర్ చేసింది. దానికి బెస్ట్ డాడీ అని క్యాప్షన్ ఇచ్చింది. రోజుల బిడ్డతో ఉన్న ఆ ఫోటో కనిపించడంతో నెటిజన్లు 'ఇలియానా రెండో బిడ్డకు జన్మనిచ్చిందా?" అని ప్రశ్నిస్తున్నారు.మరి ఈ విషయంపై మాత్రం ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండా సీక్రెట్ గానే ఉంచారు. అభిమానులు మాత్రం ఇలియానా అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. త్వరలో మంచి రోజు చూసి చెబుతుందేమో చూడాలని? పోస్ట్ పెట్టింది సరే..ఎందుకింత సీక్రెట్ ఉంచుతుంది? అనౌన్స్ చేయొచ్చు కదా.. ? అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

ఇక ఇలియానా కెరీర్ వి షయానికి వస్తే. తెలుగుతో పాటు తమిళం, హిందీ. భాషల్లో నటించి తన మార్క్ వేసింది. ఇటీవల ఆమె 'దోబెర్ దో ప్యార్' అనే హిందీ చిత్రంలో కనిపించింది. అయితే ప్రెగ్నెన్సీ కారణంగా ఆమె 'రైడ్ 2' వంటి పెద్ద అవకాశాలను వదులుకోవాల్సి వచ్చింది.చివరగా తెలుగులో అమర్ అక్బర్ ఆంటోని సినిమాలో నటించింది. 2024లో "డో ఔర్ డో ప్యార్" అనే హిందీ మూవీలో నటించింది. షీర్షా గుహా ఠాకుర్తా తెరకెక్కించిన రొమాంటిక్ కామెడీ మూవీలో విద్యా బాలన్, ప్రతీక్ గాంధీ కీలక పాత్రల్లో కనిపించారు.ఆ తర్వాత సోషల్ మీడియాలో వరుస పోస్టులతోనే తెలుగు ప్రేక్షకులకు కనిపిస్తుంది.

# ఇరాన్ యుద్ధంలోకి దిగబోతున్నాం: ట్రంప్ ప్రకటనతో మూడో ప్రపంచ యుద్ధం వచ్చేసిందా..?



గడచిన ఆరు రోజులుగా ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య దాడులు ప్రతిదాడులు తారా స్థాయికి చేరాయి. అమెరికా పదేపదే హెచ్చరించినప్పటికీ అవి అస్సలు పట్టించుకోని ఇరాన్ సుప్రీం కమాండర్ ఖమేనీ. ఇరాన్ లొంగిపోదని ఖమేనీ తాజాగా ఒక టీవీ ప్రసంగం ద్వారా ప్రకటించారు. ఏదైనా %ఖూ% సైనిక జోక్యం కోలుకోలేని నష్టాన్ని తెస్తుందని ఆయన అన్నారు. ఇజ్రాయెల్ రాత్రి దాడుల తర్వాత వేల మంది ప్రజలు టెహ్రాన్ ప్రాంతాన్ని వీడి వెళ్లిపోయిన తరుణంలో ఖమేనీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికా యుద్ధంలోకి దిగితే మాత్రం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఖమేనీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే మరోపక్క అమెరికా మాత్రం ఇజ్రాయెల్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొనే అంశంపై ఆలోచినట్లు వెల్లడైంది. ప్రస్తుతం ఇరాన్ బేషరతుగా సరెండర్ కావాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును తిరస్కరిస్తున్నట్లు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తన తాజా టీవీ ప్రసంగంలో వెల్లడించారు. ఈ పరిస్థితులు ప్రస్తుతం మూడో ప్రపంచ యుద్ధం దిశగా దారితీస్తున్నాయని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఇరాన్ దేశంతో యుద్ధం ఇజ్రాయెల్ కు భారీ భారంగా మారుతోంది. అయితే ప్రస్తుతం ఇజ్రాయెల్ వద్ద ఉన్న ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థ ఇంటర్ సెప్టార్లు కేవలం 10 రోజులకు సరిపోతాయని వెల్లడైంది. ఈ తరుణంలో అమెరికా నుంచి సరఫరాలు పెంచుకోవటం లేదా నేరుగా అమెరికా సైనికులు యుద్ధ రంగంలోకి దిగటం అనే రెండు చివరి ఆప్షన్లు మిగిలి ఉన్నాయని యుద్ధ నిపుణులు చెబుతున్నారు. ఇజ్రాయెల్ చేస్తున్న బాంబు దాడుల నుంచి తనను తాను రక్షించుకునే "చట్టబద్ధమైన" హక్కు ఇరాన్‌కు ఉందని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో ఇజ్రాయెల్‌కు అమెరికా ప్రత్యక్ష సైనిక సహాయం అందించడం వల్ల మధ్యప్రాచ్యం తీవ్రంగా అస్థిరపడుతుందని రష్యా ఉప విదేశాంగ మంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ బుధవారం హెచ్చరించారు. గడచిన 5 రోజుల్లో ఇజ్రాయెల్ చేసిన దాడులతో ఇరాన్ లోని 1100 ప్రాంతాల్లో బాంబుల మోత మోగింది.

**ఇరాన్ కి ట్రంప్ వార్నింగ్..**

సుప్రీం లీడర్ అని చెప్పుకుంటున్న ఖమేనీ ఎక్కడ దాక్కున్నాడో ఖచ్చితమైన ప్రదేశం తమకు తెలుసని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో అన్నారు. ఆయన తమకు చాలా ఈజీ టార్గెట్ అని, అయితే అతడిని తాము చంపాలని అనుకోవటం లేదని చెప్పారు. కనీసం ప్రస్తుతానికి చంపే ఉద్దేశంలో లేనట్లు చెప్పారు. అయితే తాము సామాన్య ప్రజలు, అమెరికా సైనికులపై దాడులను సహించబోమని హెచ్చరించారు. తమ సహనాన్ని పరీక్షించొద్దని.. దీనిని మీరు త్వరగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాయని తాను భావిస్తున్నట్లు ఖమేనీకి వార్నింగ్ ఇచ్చారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం: సోదరుడి పాడె మోసిన రమేష్ విశ్వాస్..భావోద్వేగ వీడియో వైరల్

అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం ఎంత విషాదాన్ని మిగిల్చిందో తెలిసిందే..ఈ ప్రమాదంలో 241 మంది ప్రయాణికులు, సిబ్బందితోపాటు 54 మంది బీజే మెడికల్ కాలేజీ మెడికోలు కూడా ప్రాణాలు కోల్పోయారు. చరిత్రలోనే అత్యంత విధ్వంసకరమైన అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ఒకే ఒక్కడు రమేష్ విశ్వాస్ బతికి బయటపడ్డాడు.. అయితే ఇదే ప్రమాదంలో రమేష్ విశ్వాస్ సోదరుడు అజయ్ రమేష్ కూడా ప్రాణాలో కోల్పోయారు. బుధవారం(జూన్18) డయ్యూలో అజయ్ అంత్యక్రియల్లో పాడే మోస్తూ రమేష్ విశ్వాస్ పాడే మోస్తూ విలపిస్తున్న దృశ్యాలకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.



బుధవారం జరిగిన అజయ్ విశ్వాస్ అంత్యక్రియాల్లో విమాన ప్రమాదం నుంచి బయటపడిన ఒకే ఒక్కడు రమేష్ విశ్వాస్ పాల్గొన్నాడు. ఈ ప్రమాదంలోనే ప్రాణాలు కోల్పోయిన వారిలో ఒకరు అజయ్ విశ్వాస్.. ఈ వీడియోలు రమేష్ ఇంకా కాలిన గాయాల నుంచి ఇంకా కోలుకోలేదు..అయినా అతని కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి సోదరుడు అంతిమయాత్రలో పాల్గొన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సోదరుడి పాడె మోస్తూ రోదిస్తూ కనిపించారు రమేష్ విశ్వాస్.

**విమాన ప్రమాద మృతులకు అంత్యక్రియలు..**

అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి డీఎన్ ఏ టెస్ట్ ద్వారా మృతదేహాలను గుర్తించి బంధువులకు అప్పగించారు అధికారులు. డీఎన్ఏ పరీక్షల ద్వారా ఇప్పటివరకు 190 మంది ప్రమాద బాధితులను గుర్తించారు. 159 మృతదేహాలను ఇప్పటికే కుటుంబాలకు అప్పగించామని అధికారులు బుధవారం తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ అంత్యక్రియలు సోమవారం పూర్తి రాష్ట్ర గౌరవాలతో మహారాష్ట్రలో జరిగాయి. మంగళవారం కెప్టెన్ సుమీత్ సభర్వాల్, సీనియర్ సిబ్బంది అపర్ణ మహాదిక్, మైథిలి పాటిల్ లకు వారి స్వస్థలాలైన ముంబై, రాయ్ గఢ్, గోరేగావ్ లలో అంత్యక్రియలు జరిగాయి.

ఈ ప్రమాదంలో నే ప్రాణాలు కోల్పోయిన అజయ్ విశ్వాస్ అంత్యక్రియలు గోవాలో అజయ్ విశ్వాస్ అంత్యక్రియలు బుధవారం జరిగాయి. సోదరుడి అంత్యక్రియల్లో కాలిన గాయాలతోనే రమేష్ విశ్వాస్ పాల్గొన్న హృదయ విదారక దృశ్యాలు అందరిని కలిచివేశాయి.

# ఆ పని ఇంకా పూర్తి చేయలేదా? ఐతే మీ బ్యాంక్ లాకర్ సీజ్ అవ్వొచ్చు తెలుసా..!




నేటి కాలంలో బ్యాంకులో లాకర్ కలిగి ఉండటం చాలా సర్వ సాధారణంగా మారిపోయింది. ఎందుకంటే విలువైన వస్తువులు, డాక్యుమెంట్లు, ఇతర వస్తువులను ఇంట్లో ఉంచుకోవటం కంటే లాకర్లలో భద్రపరచుకోవటం సేఫ్ అని చాలా మంది భావిస్తున్నారు. అయితే లాకర్లకు సంబంధించిన నిబంధనలను రిజర్వు బ్యాంక్ మార్పు చేయగా దానికి సంబంధించి కొత్త అగ్రిమెంట్లను బ్యాంకులు తమ ఖాతాదారులతో తిరిగి సంతకాలు తీసుకుంటున్నాయి.

రిజర్వు బ్యాంక్ తీసుకొచ్చిన కొత్త రూల్స్ ప్రకారం ఖాతాదారులు తమ బ్యాంక్ లాకర్లకు సంబంధించిన కొత్త అగ్రిమెంట్లపై సంతకం చేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికీ చాలా మంది దానిని పూర్తి చేయలేదని వెల్లడైంది. ఈ ప్రక్రియను పూర్తి చేయకపోతే ఖాతాదారులకు సంబంధించిన లాకర్లు సీజ్ అయ్యే ప్రమాదం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన గడువును రిజర్వు బ్యాంక్ పలుమార్లు పొడిగించింది. కొత్త అగ్రిమెంట్లలో బ్యాంక్ నిర్లక్ష్యం వల్ల లాకర్లో భద్రపరచిన వస్తువులకు సంబంధించి చట్టపరంగా ఎలా ముందుకెళ్లాలనే అంశాల్లో మార్పులు తీసుకొచ్చారు. లాకర్ల విషయంలో నిరంతరం వస్తున్న కంప్లెయింట్ల దృష్ట్యా రిజర్వు బ్యాంక్ లాకర్ పాలసీలో మార్పులు తీసుకురావాలని నిర్ణయించింది. మార్పు చేసిన నిబంధనలు కస్టమర్లకు రక్షణను పెంచటంతో పాటు పారదర్శకత పెంపు,

చట్టపరమైన సమస్యలను పరిష్కారానికి వెసులుబాట్లు కల్పించబడ్డాయి. కొత్త రూల్స్ ప్రకారం లాకర్‌లోని వస్తువులను భద్రపరచడం బ్యాంకు బాధ్యత. 2025 డిసెంబర్ నాటికి కొత్త లాకర్ అగ్రిమెంట్లపై ఖాతాదారులు సంతకం చేయకపోతే వారికి లాకర్ల యాక్సెస్ నిలిపివేయవచ్చు, అలాగే కొన్నిసార్లు బ్యాంక్ సదరు వ్యక్తికి సంబంధించిన లాకర్లను సీజ్ చేసే ప్రమాదం కూడా ఉంది. అందుకే కస్టమర్లు వెంటనే తమ లాకర్లు ఉన్న బ్యాంక్ శాఖలను సంప్రదించి దీనికి సంబంధించిన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాల్సి ఉంటుంది. బ్యాంకులు ఈ సమాచారాన్ని ఈమెయిల్స్, ఫోన్ మెసేజెస్ ద్వారా అందిస్తూ వెంటనే స్పందించి అగ్రిమెంట్లను అప్ గ్రేడ్ చేసుకోవాలని సూచిస్తున్నాయి.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# ఫ్యాన్ గిర్రున

వైసీపీ అధినేత జగన్ ఎక్కడకు పర్యటనకు వెళ్లినా విపరీతంగా జనం వస్తున్నారు. వాళ్లు కార్యకర్తలు కావచ్చు. అభిమానులు కావచ్చు. కూటమి ప్రభుత్వంపై విసుగు చెందని వారు కావచ్చు. ఎవరైనా సరే జగన్ పర్యటనలో జనం మాత్రం విపరీతంగా వస్తుండటంతో పార్టీ నేతల్లో ఉత్సాహం పెరుగుతుంది. జగన్ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత జరిపిన పర్యటనలన్నీ విజయవంతమయ్యాయి. ప్రాంతాలకు అతీతంగా సక్సెస్ కావడంతో వైసీపీ నేతల్లో తిరిగి ఉత్సాహం ఉరకలేస్తుంది. జగన్ ఏడాది కాలం నుంచి రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర లోని అనేక ప్రాంతాల్లో పర్యటించారు. తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలు రాయలసీమలోనూ, విశాఖ, శ్రీకాకుళం ఉత్తరాంధ్రలోనూ, తెనాలి, పొదిలి కోస్తాంధ్ర జిల్లాల్లో పర్యటించారు.

**జనం పోటెత్తుతుండటంతో...**

ఇప్పటి వరకూ జగన్ పర్యటించిన అన్ని ప్రాంతాలకు జనం పోటెత్తారు. జనసమీకరణ చేయడానికి పార్టీ ప్రతిపక్షంలో ఉంది. వచ్చే ఎన్నికలలో పోటీ చేయాలనుకునే వారు చేసే బలప్రదర్శన కాదు. చాలా వరకూ జగన్ కోసం వచ్చినవారేనని వైసీపీ నేతలు చెబుతున్నారు. వాహనాలను సమకూర్చకుండానే, ఎలాంటి సదుపాయాలు కల్పించకుండానే జనం తరలి రావడం చూసి నేతల్లో ఒకరమైన విజయదరహాసం కనపడుతుంది. ప్రజల్లో వచ్చిన మార్పునకు సంకేతమని సీనియర్ వైసీపీ నేత ఒకరు వ్యాఖ్యానించారు. జగన్ వస్తున్నారని తెలిసి తాము ఆహ్వానించకుండానే పత్రికలు, టీవీల్లో వార్తలు చూసి వచ్చిన వారే ఎక్కువగా కనిపిస్తున్నారని ఆయన అనడం తాము విజయానికి చేరువలో ఉన్నామని చెప్పకనే చెప్పారు.

**పార్టీని వీడదామనుకున్న వారు...**

వైసీపీ అధినేత జగన్ పర్యటనకు స్పందన మామూలుగా లేకపోవడంతో ఇక నేతలు కూడా పార్టీని వీడే ఆలోచన మానుకున్నట్లే కనపడుతుంది. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైసీపీదే అధికారం అని మానసికంగా వైసీపీ నేతలు సిద్ధమయ్యారు. ప్రధానంగా గుంటూరు జిల్లాలో ఉన్న తెనాలిలోనూ జనం అంత మేర వచ్చారంటే ఇక చెప్పాల్సిన పనిలేదంటున్నారు. ఇక పొదిలిలో పొగాకు రైతుల పరామర్శకు వెళ్లినప్పుడు జగన్ హెలికాప్టర్ దిగిన దగ్గర నుంచి యువకులు, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలు హాజరవ్వడంతో ఇక తమకు తిరుగులేదన్న అభిప్రాయంలోకి జగన్ పార్టీ నేతలు వచ్చారు. ఇక ఎప్పుడు ఎన్నికలు జరిగినా తమదే విజయం అన్న ధీమా ఫ్యాన్ పార్టీ నేతల్లో పెరిగింది.

**నాడు చంద్రబాబు సభలకూ...**

2024 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అనేక కార్యక్రమాలు పెట్టారు. అనేక నినాదాలతో కార్యక్రమాలను పెట్టి జనం ముందుకు వెళ్లారు. ఒంగోలు నాడు పెట్టిన మహానాడు సూపర్ సక్సెస్ అయింది. అప్పుడే టీడీపీ విజయం ఖాయమయిందని క్యాడర్ లో విశ్వాసం కనిపించింది. కందుకూరు, గుంటూరు వంటి సభల్లో తొక్కిసలాట జరిగి మరణించినా ఎవరూ వెనక్కు తగ్గలేదు. అదే విశ్వాసం ఇప్పుడు వైసీపీ క్యాడర్ లోనూ కనిపిస్తుంది. వైసీపీ సోషల్ మీడియా కూడా రెండు మూడు నెలల కంటే ముందు ఇప్పుడు యాక్టివ్ గా మారింది. జనం రాక చూసిన వైసీపీ నేతలు తమను అరెస్ట్ చేసుకోండి అని సవాళ్లు విసరడం కూడా అధికారంలోకి రావడం గ్యారంటీ అని భావించడం వల్లనేనని అంటున్నారు. మొత్తం మీద ఎన్నికలకు నాలుగేళ్ల ముందే వైసీపీ లో మంచి జోష్ కనిపిస్తుండటం ఆ పార్టీ నేతలను యాక్టివ్ చేసిందనే చెప్పాలి.

# పిక్కకు పోషణ



అర్ధరాత్రి మంచి గాఢనిద్రలో ఉండగా పిక్క కండరాలు పట్టేయటం, తీవ్రమైన నొప్పితో నిద్రలోంచి లేవటం చాలామందికి అనుభవమే. ఇది వృద్ధుల్లో మరింత ఎక్కువ. పిక్కలు పట్టేయటానికి ప్రధాన కారణం కదలికలకు తోడ్పడే చలన నాడులు వేగంగా, మాటిమాటికీ ఉత్తేజితం కావటం. వయసు మీద పడుతున్నకొద్దీ ఈ నాడులు క్షీణిస్తూ వస్తాయి కాబట్టి వృద్ధాప్యంలో మరింత ఎక్కువగా పిక్కలు పట్టేస్తుంటాయి. అరవై ఏళ్లు పైబడ్డవారిలో సుమారు మూడింట ఒకరు, 80 ఏళ్లు దాటినవారిలో దాదాపు సగం మంది పిక్క కండరాలు పట్టేయటంతో సతమతమవుతుంటారు. కండరాలు బలంగా ఉండటానికి, పిక్కలు పట్టేయకుండా చూసుకోవటానికి వ్యాయామం కీలకమే అయినా పోషకాహారమూ ముఖ్యమే. కండరాల పనితీరును కాపాడే అలాంటి కొన్ని పోషకాలు ఇవిగో..

మెగ్నీషియం: ఇది కండరాలు వదులుగా ఉండేలా చేస్తుంది. మెగ్నీషియం మోతాదులు తగ్గితే తరచూ కండరాలు పట్టేస్తుంటాయి, బిగుసుకుపోతుంటాయి. వృద్ధుల్లో ఇది మరింత ఎక్కువ.

విటమిన్ డి: ఇది కండరాలు బలోపేతం కావటానికి, సమన్వయంతో పని చేయటానికి తోడ్పడుతుంది. క్యాల్షియాన్ని శరీరం గ్రహించుకునేలా చేయటంలో సాయం చేస్తుంది. దీంతో కండరం సరిగా సంకోచించేలా చేస్తుంది. విటమిన్ డి తగ్గితే కండర బలహీనత, కింద పడిపోయే ముప్పు పెరుగుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

విటమిన్ ఇ: యాంటీఆక్సిడెంట్‌గా పనిచేసే ఇది రక్త ప్రసరణను పెంచుతుంది. వాపు ప్రక్రియను తగ్గిస్తుంది. ఇలా కండరాలు కోలుకోవటానికి తోడ్పడుతుంది. నిస్సత్తువను నివారిస్తుంది. కాడ్ లివర్ నూనె: ఇందులో సహజంగానే విటమిన్ డి,

ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలుంటాయి. ఇవి వాపు ప్రక్రియ తగ్గటానికి, కండరాలు కోలుకోవటానికి సహకరిస్తాయి. అందువల్ల కండరాలు బలంగా ఉండేలా చూసుకోవటానికి కాడ్ లివర్ నూనె మంచి పోషకమని చెప్పుకోవచ్చు. పిక్కలు పట్టేయటాన్ని తగ్గించుకోవటానికి, కదలికలు సాఫీగా సాగటానికి వృద్ధులకు బాగా తోడ్పడుతుంది. కదలికలకు, ఇతరుల మీద ఆధారపడకుండా ఉండటానికి, మొత్తంగా ఆరోగ్య సంరక్షణకు కండరాలే కీలకం. మెగ్నీషియం, విటమిన్ డి, విటమిన్ ఇ వంటి పోషకాలను తగినంతగా తీసుకోవటం.. అలాగే చురుకుగా ఉండటం ద్వారా కండరాలను బలంగా ఉంచుకోవచ్చు. ఆహారం, అవసరమైతే మాత్రలు లేదా తేలికైన జీవనశైలి మార్పులతో కండరాలను కాపాడుకోవటం మీద శ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా వయసు మీద పడుతున్నకొద్దీ హాయిగా జీవించటానికి ఇది అత్యవసరమని గుర్తించాలి.

## ఆధ్యాత్మికం : బుద్ధి అంటే ఏంటీ.. బుద్ధి లేకపోతే వచ్చే నష్టాలు ఏంటీ..

# యోగస్థితి లేకపోతే బుద్ధి ఉండదా..?

కర్మాచరణం.. బుద్ధి యోగంతో చెయ్యమని కదా చెప్పింది. ఆ బుద్ధి అన్ని సమయాల్లో సరిగ్గా పని చేయకపోవటానికి కారణం ఏమిటి? ఇష్టపడి కానీ, అయిష్టంతో కాని ఇంద్రియాలతో వ్యవహరించినట్టయితే మానవుడు ఇంద్రియాలలోనే నివసించటం జరుగుతుంది. ఏదైనా కావాలనే అభిలాషతోనైనా నిరంతరం తలుచుకుంటూ ఉండవచ్చు. కోరికని జయించాలనే భావంతో దానినే అనుక్షణం తలచుకుంటూ ఉండవచ్చు.రెండు సందర్భాలలోనూ ఇంద్రియాలకి లక్ష్యాలైన వాటిని తలచుకుంటూ ఉండటం వల్ల వాటితో సంబంధం ఏర్పడుతుంది. సంబంధం వల్ల కోరిక కలుగుతుంది. తెలియని వస్తువు కావాలనిపించదు కదా. ముందుగా ఇష్టం లేని వస్తువు మీద కోరిక కలుగుతుంది. దీనినే వైరభక్తి అనవచ్చునేమో. దీనికి ఉదాహరణగా ప్రస్తుత కాలంలో చాలామందికి ఉన్న చాలా అలవాట్లని (మద్యం, పొగాకు, గంజాయి మొదలైనవి) చెప్పవచ్చు. ఇవి కావాలని ఎవరూ. అనుకోరు. మొదటిమారు రుచి చూసినప్పుడు నచ్చకపోయినా, వాటి సాన్నిహిత్యం వాటికి అలవాటు పడేట్టు చేస్తుంది. అంటే ఇష్టం వల్ల మాత్రమే కాదు, తీవ్రమైన అయిష్టం వల్ల కూడా సంగం కలుగుతుంది. సంగం వల్ల కోరిక కలుగుతుంది. కోరిక క్రోధానికి దారి తీస్తుంది. ఎట్లాగంటే. అనుకున్న కోరిక తీరకపోయినా, తీరటానికి అవరోధాలు కలిగినా వచ్చేది కోపమే కదా. ఆ కోపం నిలబడిపోతే అది క్రోధం అవుతుంది. కామము.. క్రోధము జంటగా ఉంటాయి. క్రోధం ఉన్నప్పుడు. తెలివికి పొర కమ్ముతుంది. దీనివల్ల అంతకుముందు. తెలిసిన విషయాలు కూడా గుర్తు రావు. మామూలుగా కూడా కోపంలో ఒకదానికి బదులు మరొకటి చేయటం, అసలు విషయం గుర్తురావటం లేదని బాధపడుతూ ఉండటం గమనించవచ్చు. తెలిసిన మంచి విషయాలే మరపుకి రావటంతో బుద్ధి నశిస్తుంది. బుద్ధి నశిస్తే సమస్తం నాశనమైనట్టే కదా..!

బుద్ధి నశించకుండా దానితో కలిసి ఉండటం (బుద్ధి యోగం) వల్ల రాగద్వేషాలు తొలగిపోతాయి. అంటే తీవ్రమైన ఇష్టం కానీ, అయిష్టం కాని ఉండవు. ఇంద్రియాలు ఇంద్రియార్థాలలో వర్తిస్తున్నా ఇంద్రియాలు తన ఆధీనంలోనే ఉంటాయి. సమర్థుడైన యజమాని ఆధీనంలో ఉన్న సేవకులలాగా ఇంద్రియాలు వర్తిస్తూ ఉంటాయి. యజమాని మంచి వాడైనప్పుడు సేవకులు బలవంతంగా కాక ప్రేమతో, ఇష్టంగా పనిచేస్తారు.. అప్పుడు సేవకులు తాము చేసే పనిని సంతోషంగా చేస్తారు. వారికి కూడా ఆనందం లభిస్తుంది – జీత భత్యాలతో పాటు. అదేవిధంగా ఇంద్రియాలు తన అధీనంలో ఉన్నప్పుడు కన్ను తనకి నచ్చిన రూపంలో.




వర్తిస్తున్నా, చెవి తనకి ఇష్టమైన శబ్దమునందు వర్తిస్తున్నా, నాలుక కోరిన రుచియందు వర్తిస్తున్నా, ముక్కు తనను ఆకర్షించిన వాసనను ఆస్వాదిస్తున్నా, శరీరం స్పర్శను ఆనందిస్తున్నా అవి తన ఆధీనంలో ఉంటాయి. వాటిని నిరోధించే ప్రయత్నం చేస్తే ఎదిరించటానికి సిద్ధం అవుతాయి. వాటిపై నిఘా ఉంచి వాటి పనిని వాటిని చేసుకోనిస్తే మంచిది. కాస్త అలుసు ఇస్తే మాత్రం నెత్తికెక్కి పెత్తనం చేస్తాయి. బానిసని చేసుకుంటాయి. అంటే అతిగా ఇష్టపడ్డా, కోప్పడ్డా సంగమే కదా. ఇంద్రియాలు తన ఆధీనంలో ఉంటే అభిముఖ్యం కాని, వైముఖ్యం కాని తన చేతిలోనే ఉంటాయి కాని ఇంద్రియాలకి ఉండని స్థితి వస్తుంది. అంటే ఇంద్రియాల మీది పెత్తనం మనసు చేతిలో నుండి బుద్ధి చేతికి అప్పచెప్పటం జరుగుతుంది. అప్పుడు మనిషి తన పట్ల విధేయత ఉన్న తనలోని భాగాలు ఉన్నవాడు అవుతాడు. దీని వల్ల జీవుడు ప్రసన్నంగా ఉంటాడు. కదలని నీటిలో ఆకాశం, సూర్యుడు, చంద్రబింబం, నక్షత్రాలు మొదలైన శాశ్వత తత్వాలు యథాతథంగా ప్రతిబింబించినట్టురాగద్వేషాదుల చేత, ఇతరుల గురించి, వస్తువుల గురించి, అభిప్రాయాల చేత కలుషితం కాని మనసులో ఎదుటివారి యందున్న దైవీతత్వం ప్రతిబింబిస్తుంది. అదే ప్రసన్నమైన మనసు. దీనివల్ల దుఃఖానికి కారణాలైనవి అన్నీ పోతాయి. దుఃఖం పోతే మిగిలేది బుద్ధి. అదే తానై ఉండటం.

యోగస్థితి లేక పోతే బుద్ధి ఉండదు. బుద్ధి మనసుగా, ఇంద్రియాలుగా చెల్లా చెదురైపోతూ ఉంటుంది. చెదిరిన స్థితిలో, దానిలో ప్రతిబింబించే భగవత్తత్త్వం కూడా సమగ్రంగా ఉండదు. అలలున్న కోనేటిలో సూర్యుడి ప్రతిబింబంలాగా ముక్కలు ముక్కలుగా కనపడుతుంది. భగవన్మయమైన ప్రకృతి లేక వాతావరణం కల్లోలంగా ఉన్న మనసు మీద ప్రతిబింబించితే భగవంతుడుగా కాక వస్తువులుగా, కోరికలుగా, బంధుత్వాలుగా, శతృత్వాలుగా, సుఖ దుఃఖాలుగా కనపడుతుంది. కనుక దైవభావన ఉండదు.

ఇంక శాంతి ఎట్లా ఉంటుంది? శాంతి లేని వాడికి సౌఖ్యం ఉండదు కదా..

దీనికి మంచి పోలిక చెపుతాడు శ్రీకృష్ణుడు. బాగా అర్థమై వంటపట్టటానికి, ఉప్పెన వచ్చినప్పుడు గాలి వాలుకి వెడుతున్న కెరటాలు ఎటు తీసుకెళ్తే నావ అటు వెళ్ళినట్టు.. ఇంద్రియాలు అనే అలల చేత కదపబడుతున్న ప్రజ్ఞ కూడా అవి తీసుకువెళ్ళిన తీరానికే చేరుతుంది. కానీ గమ్యం అది కాదు కదా. అనుకున్న గమ్యం చేరటానిక్ ప్రజ్ఞని బుద్ధితో యోగం చెయ్యాలి. యోగం అంటే కలయిక అని కదా అర్థం. అంటే ప్రజ్ఞని బుద్ధితో చేర్చాలి. ఇదే గొప్ప నేర్పు. ఈ నేర్పు లేకపోతే లక్ష్యం చేరలేము. అందుకే 'బుద్ధి నాశాత్ ప్రణశ్యతి' అని నశించకుండా ఉండే మార్గం తెలియజేశాడు జగద్గురువు శ్రీకృష్ణుడు..

# ఆ హీరో అంటే చాలా ఇష్టం



సాధారణ ప్రేక్షకులకే కాదు, సినిమాల్లో నటించే హీరోలకీ, హీరోయిన్లకు కూడా అభిమాన నటీనటులుంటారు. అయితే కొంతమంది తమ అభిమాన నటీనటుల గురించి బయటకు చెప్తే మరికొందరు మాత్రం తమ యిష్టాయిష్టాలను మనసులోనే దాచుకుని అభిమానిస్తుంటారు. సౌత్ హీరోయిన్ స్నేహ తాజాగా తనకు ఇష్టమైన హీరో గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. తెలుగు, తమిళ భాషల్లో పలు సినిమాలు చేసి ఎంతో మంది అభిమానుల్ని సొంతం చేసుకున్న స్నేహను అందరూ చాలా ఇష్టపడతారు. పక్కింటి అమ్మాయిలా కనిపించే స్నేహ ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. తొలి వలపు సినిమాతో తెలుగు సినీ పరిశ్రమకు పరిచయమైన స్నేహ ఆ తర్వాత ప్రియమైన నీకు సినిమాతో సూపర్ హిట్ ను ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత హీరోయిన్ గా స్నేహ వరుస సినిమాలు చేసింది. అందంతో పాటూ మంచి అభినయంతో ఎంతో మందిని ఆకట్టుకున్న స్నేహ ఈ మధ్య సపోర్టింగ్ రోల్స్ లో కనిపిస్తోంది. మొన్నా మధ్య అల్లు అర్జున్ హీరోగా వచ్చిన సన్నాఫ్ సత్యమూర్తి సినిమాలో ఉపేంద్ర భార్యగా కనిపించగా, ఆ తర్వాత వినయ విధేయ రామలో రామ్ చరణ్ కు వదిన పాత్రలో మెరిసింది. రీసెంట్ గా డ్రాగన్ సినిమాలో డాక్టర్ పాత్రలో కూడా స్నేహ మెరిసింది.రీసెంట్ గా గోట్ సినిమాలో విజయ్ కు భార్యగా నటించి ఆకట్టుకున్న స్నేహ తమిళంలో చాలా మంది స్టార్ హీరోలతో కలిసి వర్క్ చేయగా, వారందరిలో తనకు అజిత్ అంటే ఇష్టమని తెలిపింది. విజయ్, కమల్, సూర్య, అజిత్, ప్రశాంత్, ధనుష్ తో కలిసి నటించిన స్నేహకు మీ ఫేవరెట్ హీరో ఎవరనే ప్రశ్న రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో ఎదురవగా తనకు అజిత్ అంటే ఇష్టమని చెప్పింది. ప్రస్తుతం సినిమాల ఎంపిక విషయంలో జాగ్రత్తగా ఉంటున్న స్నేహ ఎంతో ఆచితూచి వ్యవహరిస్తుంది.



## అలియా భట్ ప్రతిభకు చక్కదనం కలిసొచ్చింది



## షష్టిపూర్తిలో ఆకాంక్ష సింగ్ క్లాసిక్‌గా కనిపిస్తుంది

# వార్-2.. నిర్మాతలు పెద్ద యుద్ధమే చేయాలేమో?




టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ ప్రముఖ నటుడు హృతిక్ రోషన్ కాంబినేషన్ లో వార్-2 మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఆ సినిమాతోనే తారక్ బాలీవుడ్ లోకి ఎంట్రీ (డైరెక్ట్ హిందీ మూవీ) ఇస్తున్నారు. స్పై జోనర్ లో స్టార్ డైరెక్టర్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా.. యష్ రాజ్ ఫిల్మ్స్ భారీగా నిర్మిస్తోంది.బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ఫీమేల్ లీడ్ రోల్ లో నటిస్తున్న వార్-2ను ఆగస్టు 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం బిజినెస్ కు సంబంధించిన వ్యవహారాలు పూర్తి చేస్తున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది.అయితే తెలుగులో కూడా వార్-2 రిలీజ్ కానుండగా.. ఇప్పటికే థియేట్రికల్ రైట్స్ కోసం టాలీవుడ్ బడా ప్రొడక్షన్ హౌసెస్ పోటీ పడినట్లు కొద్ది రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. కానీ వారెవరికీ హక్కులు ఇవ్వమని యష్ రాజ్ ఫిల్మ్స్ చెప్పిందని టాక్. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా సినిమాను సొంతంగా రిలీజ్ చేయాలని నిర్ణయించుకుందని సమాచారం.అదే సమయంలో తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్ వాల్యూ రూ.90 కోట్ల వరకు ఉంటుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇప్పుడు వాటిని తిరిగి పొందాలంటే.. వార్-2 మేకర్స్.. పెద్ద యుద్ధమే చేయాలేమోనని అంటున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ సేఫ్ జోన్ ఉండే ఛాన్స్ ఉన్నా.. రిస్క్ చేస్తుందని అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా స్పై జోనర్ కు తెలుగులో మరింత అంత ఫ్యాన్ బేస్ ఉండదు. అందుకే జోనర్ తోనే ఫస్ట్ సమస్య. ఆ తర్వాత ఎన్టీఆర్ సోలో మూవీ అయితే.. తెలుగులో భారీ వసూళ్లు రాబట్టడం ఈజీనే. కానీ సినిమా కంటెంట్ అంతా బాలీవుడ్ ఫ్లేవర్ లో ఉన్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. కాబట్టి తారక్ ప్రమోషన్స్ చేసినా అది సరిపోదు.అదే సమయంలో వార్-2 రిలీజ్ రోజు కూలీ మూవీ విడుదల కానుంది. రజనీకాంత్, లోకేష్ కనగరాజ్ కాంబోలో రానున్న ఆ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రమోషన్స్ కూడా జోరుగా సాగుతున్నాయి. సినిమాలో అన్ని ఇండస్ట్రీల నటులున్నారు. దీంతో వార్-2 కన్నా కూలీకే ఎక్కువ బ్రాండ్ వాల్యూ ఉన్నట్లు కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు వార్-2.. తెలుగులో ఎలా గట్టెక్కుతుందో వేచి చూడాలి.